Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 04.05.2018, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 48 పేజీలు : 16, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

● కృష్ణ జిల్లాకి ఎన్టీఆర్ పేరు

## జగన్ వాగ్దానం... బాబుకు అవమానం



> వైసిపి దెబ్బకు 'దేశం' దిమ్మ తిరిగింది

స్వర్గీయ నందమూరి తారక రామారావు... తెలుగు తెరపై, తెలుగు నేలపై... తెలుగు రాజకీయాలపై పెను సంచలనం. 300కు పైగా విభిన్న చిత్రాలలో నటించి తెలుగు ప్రేక్షకుల మనసుల్లో రాముడిగా, కృష్ణుడిగా ఎలాంటి ముద్ర వేసుకున్నాడో, తెలుగు రాజకీయాలలోనూ 2రూపాయల కిలో బియ్యం వంటి పథకాలతో తెలుగు ప్రజల గుండెల్లో ఆరాధ్య దైవమయ్యాడు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను మట్టి కరిపించిన నాయకుడు. పంచాయితీ వార్డు మెంబర్లుగా గెలవలేని వారిని ఎమ్మెల్యేలను, మంత్రులను చేసిన ఛరిష్మాగల నాయకుడు.

(మిగతా 15వ పేజీలో)




## భయం మొదలైంది!

15లో

### చంద్రబాబు గుండెల్లో అవినీతి రైళ్ళు

### పవన్ విసిరిన పంజాతో...

## దెబ్బతినేదెవరు?



జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వ్యవహారశైలే కాదు, మాటల్లోనూ మార్పు కనిపిస్తోంది. ఈ మార్పు మూలంగా రాష్ట్ర రాజకీయాలలో ఎటువంటి మార్పులు చోటుచేసుకుంటాయోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

చంద్రబాబుతో సఖ్యతగా వున్నంతకాలం కూడా పవన్‌కళ్యాణ్ అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేసే బలం తమకు లేదని, సత్తా వున్నచోటే పోటీ చేస్తామని చెప్పుకుంటూ వచ్చాడు. అదీగాక, ముఖ్యమంత్రి అయ్యే

(మిగతా 15వ పేజీలో)



## సంస్మరణ

నేదురుమల్లి ఫౌండేషన్

సామాన్యులను నాయకులుగా మలచిన
రాజకీయ యోధుడు
పేద, దళిత, బడుగు, బలహీన వర్గాల
జనబాంధవుడు
రాజకీయాలలో తనదైన ముద్రవేసుకున్న
ప్రజానాయకుడు
మాజీ ముఖ్యమంత్రి

### శ్రీ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి గారు

స్వర్గస్తులై తేది.09.05.2018 నాటికి
నాలుగేళ్ళు గడవనున్న సందర్భంగా
వారి జ్ఞాపకాలను స్మరించుకుంటూ...



**నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**
ఛైర్మెన్, నేదురుమల్లి ఫౌండేషన్

# వైభవంగా పెంచలకోన తిరునాళ్ళు


స్వామి అమ్మవార్లను గోనుపల్లికి తీసుకెళ్తున్న భక్తులు

నెల్లూరుజిల్లా రాపూరు మండలంలోని పెంచలకోన క్షేత్రంలో స్వయంభువుగా వెలిసి భక్తులచే ఆరాధ్యదైవంగా వెలుగొందుతున్న శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గత నెల 25 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. గత నెల 25న శ్రీవార్ల ఉత్సవమూర్తులు ఉదయం గోనుపల్లి గ్రామం నుండి పెంచలకోన క్షేత్రానికి తీసుకురావడంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యాయి. గత నెల 26న ధ్వజారోహణ, సహస్ర దీపాలంకరణ సేవ, రాత్రి 10గంటలకు శేషవాహనసేవ నిర్వహించారు. 27న రాత్రి 10గంటలకు బంగారు హనుమంతసేవ, 28న శ్రీ నరసింహ జయంతి శుభ సందర్భంగా బంగారు గరుడసేవ, 29న శ్రీవార్లకు తిరుకల్యాణ మహోత్సవం, సాయంత్రం రథోత్సవం, రాత్రి 9గంటలకు గజవాహనసేవ, 30న ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రి తెప్పోత్సవం, అశ్వవాహనసేవ, ధ్వజావరోహణం జరిగాయి. 1వ తేదీ గోనుపల్లికి స్వామివారు బయలుదేరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించారు.

120 బస్సులు 300మంది పోలీసు సిబ్బంది, 60మంది వైద్యసిబ్బంది, 80మంది పంచాయితి సిబ్బంది, 20మంది ఫైర్ సిబ్బంది, ఇతర అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. దేవస్థాన పాలకమండలి ఛైర్మెన్ తానంకి నానాజీ, పాలకమండలి సభ్యులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# ముగిసిన వేదగిరి బ్రహ్మోత్సవాలు



నెల్లూరురూరల్ మండలం నరసింహకొండలో వెంచేసియున్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 1న శ్రీ స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తొలుత ఉత్సవమూర్తులను వేదపండితులు వేదమంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా సిద్ధం చేసిన రథంపై ప్రతిష్టించారు. దేవరపాలెంలో జరిగిన ఈ రథోత్సవానికి జిల్లా నలుమూలల నుంచే కాక వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. గతనెల 24వతేదీ అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ ప్రత్యేకపూజా కార్యక్రమాలతో పాటు ప్రత్యేక ఉత్సవాలను నిర్వహించారు. బంగారు గరుడసేవ, కళ్యాణోత్సవం వేడుకలను విశేషంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసారు. ఆలయ ఛైర్మెన్ మల్లినేని వెంకటేశ్వరరావు, కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# కావలి రెడ్‌క్రాస్ ప్రతినిధులకు బంగారు పతకాలు

రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా బాధితులకు, అభాగ్యులకు, ప్రకృతి వైపరీత్యాల పీడితులకు, దళిత గిరిజన వర్గాలకు సేవలందిస్తున్న రెడ్‌క్రాస్ సేవకుల అవార్డుల ప్రదానోత్సవం విశాఖపట్నంలోని ఉడా చిల్డ్రన్ థియేటర్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ దంపతులు ఇఎస్ఎల్ నరసింహన్ విమలా నరసింహన్ అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీఓ ఐ.భక్తవత్సలరెడ్డి, కళాబంధు మన్నెమేల గోపాలరెడ్డి(కావలి రెడ్‌క్రాస్ ప్యాట్రన్స్ కమిటి ఛైర్మెన్), డి.రవిప్రకాష్(కావలి రెడ్‌క్రాస్ ఛైర్మెన్), గంధం ప్రసన్నాంజనేయులు(జిల్లా పాలకమండలి సభ్యులు) బంగారు పతకాలను అందుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకాలేక పోయిన డా॥ సి.లక్ష్మీనరసారెడ్డి(ఛైర్మెన్, కెకెఆర్ ఐఆర్‌సిఎస్ రక్తనిధి, కావలి) పతకాన్ని ఆర్డీఓ అందుకున్నారు.

# జర్నలిస్టుల హెల్త్‌కార్డుల గడువు పొడిగింపు

జర్నలిస్టుల హెల్త్‌కార్డుల గడువును ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని సమాచార పౌరసంబంధాల శాఖ డిడి లాల్‌జాన్ ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రెన్యూవల్, కొత్త హెల్త్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# వాడవాడలా మేడే




నెల్లూరులో మేడే సందర్భంగా ఎక్కడ చూసినా ఎర్రజెండాలు రెపరెపలాడాయి. ఎర్ర చొక్కాలు ధరించిన కార్మికులు జిల్లా వ్యాప్తంగా భారీ ప్రదర్శనలు నిర్వహించారు. పలు సెంటర్లలో జెండా ఆవిష్కరణలు, సేవా కార్యక్రమాలు చేపట్టారు. నిరుపేదలకు అన్నదానం, మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం 'మేడే'ను ఈ నెల 1వ తేదీన కార్మికులంతా ఘనంగా నిర్వహించారు. సిపిఎం నగర కమిటి ఆధ్వర్యంలో నెల్లూరు ఏబిఎం కాంపౌండ్ నుంచి కార్మికులు ఎర్రచొక్కాలు, ఎర్ర చీరలు ధరించి గాంధీబొమ్మ, వీఆర్సీ, బారకాసు, పెద్దబజారు, చిన్నబజారు మీదుగా ములుమూడి బస్టాండ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. సిపిఎం రూరల్ కమిటి ఆధ్వర్యంలో ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియం నుంచి బొల్లినేని, కేవిఆర్ పెట్రోల్ బంకు మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు మరో ప్రదర్శన చేపట్టారు. అనంతరం రెండు ప్రాంతాల్లో సిపిఎం నాయకులు పి.చంద్రారెడ్డి, అల్లాడి గోపాల్ అధ్యక్షతన బహిరంగ సభలను నిర్వహించారు.

కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏఐటియుసి అనుబంధ ఏ.పి మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్, ఆధ్వర్యంలో ఏ.కె.నగర్‌లోని ఈఎస్ఐ డిస్పెన్సరీలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటి సివిల్ సర్జన్ డాక్టర్ జి.వెంకటేశ్వర్లు పాల్గొని ఈఎస్ఐలో పలు సమస్యలపై వివరించారు.

16వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని సిపిఎం సీనియర్ నాయకులు జక్కా వెంకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ కార్మికుల హక్కుల కోసం ఉద్యమించిన రోజు మేడే అని, దక్షిణ భారత కమ్యూనిష్టు పార్టీ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య జయంతి కూడా మేడే రోజున కావడం విశేషమన్నారు.

కార్మికుల దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈ నెల 1వ తేదీ సాయంత్రం తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ అధ్యక్షులు ఎన్‌వి సుకుమార్ ఆధ్వర్యంలో మేడే దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి నగర పార్టీ ఇన్‌ఛార్జ్ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, డెయిరి ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ఆత్మజ్ఞానం అమృతం లాంటిది

**- సత్యవ్రతానంద సరస్వతిస్వామిని ఉద్బోధ**

ఆత్మజ్ఞానం అమృతం లాంటిదని, దానికి మరణం లేదని ఆధ్యాత్మిక ప్రవచకులు, పరమపూజ్య సత్యవ్రతానంద సరస్వతి స్వామిని ప్రవచించారు.

నెల్లూరు టౌన్‌హాల్‌లో గత నెల 23 నుంచి 28వ తేదీ వరకు చెన్నై యజ్ఞ కమిటి, అక్షర విద్యా ట్రస్టు ఆధ్వర్యంలో గీతాజ్ఞాన ప్రవచనములలో భగవద్గీతలోని 12వ అధ్యాయం భక్తియోగంపై స్వామిని ప్రవచించారు. మనము చేసే ప్రతి పనిని కూడా భగవంతునికి అర్పణభావంతో చేయాలని, మనం పొందే ఫలములను భగవంతుని ప్రసాదంగా భావించాలన్నారు. శ్రీరామ గీతలో లక్ష్మణుడు తన సోదరుడైన శ్రీరామచంద్రుని గురువుగా స్వీకరించి భక్తితో సాష్టాంగ నమస్కారం చేసి ఈ సంసార బంధమును దాటించమని ప్రార్థించాడని స్వామిని ప్రకటించారు. ఆత్మ విచారణతోనే బ్రహ్మస్వరూపం సాక్షాత్కారం సాధ్యమన్నారు. అహంకారం ఉంటే ఆత్మజ్ఞానం లభించదన్నారు. దైవత్వాన్ని వెలికితీసేదే వైదిక వాఙ్మయం అని స్వామిని ప్రవచించారు. భగవద్గీత శ్రవణంతో జీవితంలో అన్ని రకాలుగా క్షేమం, లాభాలు లభిస్తాయని, మంచి జరుగుతుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 7.30గంటల నుంచి 8.30 గంటల వరకు శ్రీరామగీతపై స్వామిని ఉపన్యసించారు.

వారంరోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని గూడూరు లక్ష్మి పర్యవేక్షించారు.

# అనారోగ్యంతో అనంతసాగరం తహశీల్దారు మృతి

అనంతసాగరం తహశీల్దారు ఎం. చెంచుకృష్ణమ్మ (59) ఈ నెల 2వ తేదీ అనారోగ్యంతో నెల్లూరులోని ఆసుపత్రిలో చికిత్సపొందుతూ కన్నుమూశారు. గత నెల 26న గొరవరంలో జరుగుతున్న గ్రామసభకు హాజరైన ఆమె ఒక్కసారిగా వాంతులు చేసుకుంటూ అస్వస్తతకు గురై కుప్పకూలిపోవడంతో, సిబ్బంది వెంటనే ఆమెను ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు. షుగర్ లెవల్స్, రక్తపోటు ఎక్కువగా ఉండడంతో ఆమెకు ప్రాథమిక చికిత్సచేసి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. నెల్లూరులోని బొల్లినేని ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతూ మృతిచెందారు. జిల్లా కలెక్టర్ ఆర్. ముత్యాలరాజు, జాయింట్ కలెక్టర్ వెట్రిసెల్వి, ఏపి రెవిన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ముత్యం నరసింహులు, జిల్లా కార్యదర్శి అల్లంపాటి పెంచలరెడ్డి తదితరులు ఆమె మృతదేహాన్ని సందర్శించి, ఆమె కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

# శబరి శ్రీరామక్షేత్రంలో హనుమజ్జయంతి వేడుకలు

నెల్లూరు దర్గామిట్టలోని శబరి శ్రీరామక్షేత్రంలో హనుమజ్జయంతి వేడుకలు ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభం అవుతున్నట్లు దేవస్థానం ఛైర్మెన్ చెన్నూరు వెంటేశ్వర్‌రెడ్డి తెలిపారు. 4వ తేదీ నుంచి దేవస్థానంలో విజయవాడ హనుమదీక్షా పీఠం వారిచే అఖండ హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందన్నారు. 7 నుంచి 9వ తేదీ వరకు ప్రతిరోజూ విశేష కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేక అలంకారం, హోమాలు, పల్లకిసేవలు జరుగుతాయన్నారు. 10వ తేదీ హనుమజ్జయంతి సందర్భంగా ఉదయం సుందరకాండ పారాయణం, లక్ష మల్లెల అర్చనలు జరుగుతాయని తెలిపారు. రాత్రి ఆంజనేయస్వామి వెండి దాలర్ల పంపిణీ, స్వామివారి గ్రామోత్సవం వేడుకగా జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

# జడ్పీ సర్వసభ్య సమావేశం 5న

ఈ నెల 5వ తేదీన నెల్లూరు దర్గామిట్టలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ సర్వసభ్య సమావేశం జరుగుతుందని సిఇఓ సిహెచ్ సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం 10గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, తాగునీరు, గ్రామీణ సమస్యలు, ఉపాధి, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, అభివృద్ధి పనులు తదితర అంశాలపై ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్‌తోపాటు, మంత్రులు పాల్గొంటారని, జడ్పీటిసి సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

# పోలవరంకు రూరల్ రైతులు

నెల్లూరురూరల్ మండలానికి చెందిన పలువురు రైతులు సోమవారం పోలవరాన్ని సందర్శించారు. ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. జలవనరుల శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో వీరంతా పోలవరం వెళ్ళడం జరిగింది.



SRI. K.V. RATNAM
'శీలేన శోభతే విద్య'

# SSC 2018 లో రికార్డుస్థాయి ఫలితాలతో రాష్ట్రంలోనే అగ్రగామిగా...

# రత్నం స్కూల్స్

డే & రెసిడెన్షియల్స్

IIT, మెడికల్ ఫౌండేషన్ వంటి అద్భుతమైన ప్రోగ్రామ్స్ నిర్వహిస్తూ కూడా SSC ఫలితాలలో నెం. 1

## 10 GPAల ప్రభంజనం

**153** Students who made us proud by securing GPA score of **10/10**

**768** Students Secured above **9/10**

| GPA | 10 10 | 9.8 ABOVE 10 | 9.7 ABOVE 10 | 9.5 ABOVE 10 | 9.3 ABOVE 10 | 9.2 ABOVE 10 | 9.0 ABOVE 10 |
|---|---|---|---|---|---|---|---|
| Number of Students | 153 | 275 | 394 | 491 | 588 | 678 | 768 |

సబ్జెక్టు వారిగా 10 GPA గ్రేడ్లు సాధించిన విద్యార్థులు

| | | | |
|---|---|---|---|
| సైన్స్ | 328 | సోషల్ | 476 |
| మ్యాథ్స్ | 497 | తెలుగు | 641 |
| హిందీ | 391 | ఇంగ్లీషు | 650 |

పరీక్షకు హాజరైన మొత్తం విద్యార్థులు - 1303

ఈ ఘన విజయాలు సాధించిన విద్యార్థినీ,
విద్యార్థులకు అభినందనలు..
ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ధన్యవాదములు..
విజయాలకు కారకులైన అధ్యాపక, అధ్యాపకేతర
సిబ్బందికి, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు...

కె.వి. రత్నం, చైర్మన్ | కె. వేణుగోపాల్, మేనేజింగ్ డైరెక్టర్ | డా॥ కె. క్రిష్ణ కిషోర్, M.S. (Ortho.), అకడమిక్ డైరెక్టర్

రత్నం స్కూల్స్ నెల్లూరు
డే & రెసిడెన్షియల్ స్కూల్స్

| PIDATHAPOLUR | SARASWATHI NAGAR | HARANATHPURAM |
|---|---|---|
| 94409 35209, 92480 48090 | 92464 33550, 92464 33681 | 87900 42323, 7702000054 |

## 'ప్రభా'తం

# ఈ బంధం.. మరింత దృఢం కావాలి



ప్రధాని మోడీ రెండురోజుల చైనా పర్యటన విజయవంతమైంది. అటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, ఇటు భారత ప్రధాని నరేంద్రమోడీ ఇరువురూ సుహృద్భావ వాతావరణంలో చర్చలు జరిపి ఇరుదేశాల మైత్రీబంధాన్ని మరింత సుదృఢం చేసుకునేలా మేలైన నిర్ణయాలు తీసుకున్నారు. ప్రపంచంలోని రెండు అతిపెద్ద దేశాలుగా ఉన్న చైనా-భారత్‌లు రెండూ సరిహద్దుల్లో శాంతి సామరస్యతలకు, ఇరుదేశాల ప్రగతికి మేలుబాటలు వేసుకుంటూ మంచి నిర్ణయాలు తీసుకోవడం ఎంతైనా శుభపరిణామం.

'శాంతిని సాధిద్దాం.. కలసి నడుద్దాం.. అన్ని రంగాల్లో సహకరించుకుందాం. ఇరుగుపొరుగు దేశాలుగా మంచి అభివృద్ధికి బాటలు వేసుకుందాం. ఆర్థిక ప్రపంచీకరణకు వెన్నెముకగా నిలుద్దాం' అంటూ ఇరుగుపొరుగు దేశాలైన చైనా-భారత్‌లు నిర్ణయించుకోవడం శుభపరిణామం.

తాజాగా జరిగిన భారత ప్రధాని నరేంద్రమోడీ చైనా పర్యటనలో ఇరుదేశాల అధినేతలు ఎంతో సుహృద్భావపూరిత వాతావరణంలో కలసి మెలసి అడుగులు వేస్తూ తమ ఆలోచనలు పంచుకోవడం, ఈ సందర్భంగా, చైనాలోని వూహాన్ విహారక్షేత్రంలోని తూర్పుతీర సరస్సులో పడవలో విహరిస్తూ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, భారత ప్రధాని మోడీ కలసి ఇరుదేశాలకు సంబంధించిన అనేక కీలకమైన అంశాలపై అరమరికలు లేకుండా చర్చించుకోవడం, చర్చలు సఫలీకృతం కావడం ఇరుదేశాల మైత్రీయాత్రలో మరో మైలురాయిగానే భావించవచ్చు. పరస్పరం నమ్మకం.. న్యాయం.. గౌరవమే ప్రాతిపదికగా, ఇరుదేశాలకు ప్రయోజనకారిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఘర్షణాత్మక వైఖరికి స్వస్తి పలకాలని, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తితో ముందుకు సాగాలని ఇరుదేశాల అధినేతలు నిర్ణయించుకోవడం మంచి పరిణామం.

అంతేకాదు, పరస్పర విశ్వాసం, అవగాహనలను పెంపొందించుకునే రీతిలో సమాచార వ్యవస్థను బలోపేతం చేసుకోవాల్సిందిగా తమ సైన్యాలకు వ్యూహాత్మక మార్గనిర్దేశం చేయాలని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, భారత ప్రధాని నరేంద్రమోడీ ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాల పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలి కాలంలో వివాదాస్పద డోక్లామ్ విషయంలో ఎప్పుడు ఎలాంటి పరిస్థితి ఏర్పడుతుందోనని అందరూ ఆందోళన చెందుతున్న పరిస్థితుల్లో చైనా శాంతినాదం.. తాజా నిర్ణయాలు సంతోషదాయకం. సరిహద్దుల్లో శాంతి సామరస్యతలు నెలకొనాలని, డోక్లామ్ ప్రతిష్టంభన పునరావృతం కాకూడదని ఇరుదేశాల అధినేతలు తీసుకున్న ఈ నిర్ణయం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వెల్లడవుతున్నాయి. చైనా తొలినుంచి భారత్‌తో మంచి స్నేహసంబంధాలతో ఉన్నా, ఇటీవలి కాలంలో వస్తున్న విభేదాల నేపథ్యంలో ప్రధాని మోడీ చొరవగా చైనాకు వెళ్ళి భారత్-చైనాల చెలిమిని మరింత సుస్థిరమయ్యేవిధంగా డోక్లామ్ విషయమై చర్చలు జరపడం ఎంతైనా హర్షణీయం.

మోడీ చైనాలో రెండురోజులు పర్యటించి చైనా అధ్యక్షునితో సంప్రదింపులు జరపడం, ముఖ్యంగా సరిహద్దుపై సహేతుకమైన, పరస్పర అంగీకారయోగ్యమైన పరిష్కారానికి వచ్చే బాధ్యతను ప్రత్యేక ప్రతినిధులకు అప్పగించాలని ఇరుదేశాలు నిర్ణయించుకోవడం ఆహ్వానించదగిన పరిణామం. వివాదాస్పద సరిహద్దుపై ఏర్పాటైన ప్రత్యేక ప్రతినిధుల సమావేశాలు గతకొద్దికాలంగా జరుగుతూనే ఉన్నా, డోక్లామ్ వంటివి వారి పరిధిలోకి రావని పేర్కొన్న చైనా, ఇప్పుడు మనసు మార్చుకుని, సరిహద్దుపై సహేతుకమైన.. పరస్పర అంగీకారయోగ్యమైన పరిష్కారానికి వచ్చే బాధ్యతను 'ప్రత్యేక ప్రతినిధులకు' అప్పగించాలని నిర్ణయించుకోవడం ఈ చర్చల్లో ఒక మేలిమలుపు. ప్రపంచంలోని రెండు అతిపెద్ద దేశాలుగా ఇటు ప్రాంతీయంగానూ, ఇటు ప్రపంచవ్యాప్తంగానూ భవిష్యత్తులో అనేక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఇరుదేశాల అధినేతలు ఇలా మంచి నిర్ణయాలు తీసుకోవడంతో ఇరు దేశాల చర్చలు సత్ఫలితాల దిశగా సాగినట్లేనని ప్రత్యేకించి చెప్పనక్కర లేదు. చైనా-భారత్ రెండూ మంచి ఇరుగుపొరుగు దేశాలుగా, మంచి మిత్రులుగా ఉండాలని, ప్రపంచాన్ని మార్చడంలో రెండు దేశాలు ఒకరినొకరు క్రియాశీల శక్తులుగా పరిగణించాలని ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఉద్ఘాటించారు. దాపరికం లేని, సకారాత్మక, సమ్మిళిత దృక్పథంతో ఒకరి ఉద్దేశాలను మరొకరు సరిగ్గా విశ్లేషించుకోవాలని, భేదాలను మరింత పరిపక్వతతో పరిష్కరించు కోవాలని సూచించారు. ఇరుదేశాలు ఆధ్యాత్మిక, వాణిజ్య, సాంకేతిక రంగాల్లోనూ, వినోదం, సంప్రదాయ రంగాల్లోనూ ఒకరికొకరు సహకరించుకోవాలని, రెండు దేశాలు పరస్పరం చలనచిత్రాలను ప్రదర్శించు కోవడం కూడా ఒక మంచి ఆలోచన అని జిన్‌పింగ్ ఆకాంక్షించారు.

మొత్తంగా ఈ చర్చల ఫలితాల పట్ల భారత ప్రధాని మోడీ స్పందిస్తూ, 'చైనాతో పరస్పర చర్చలు జరిపాం. భారత్-చైనా స్నేహబంధం బలోపేతమైతే ఇరుదేశాల ప్రజలకే కాక, ప్రపంచానికంతటికీ ప్రయోజనకరమని' పేర్కొన్నారు. ఇలా స్వేచ్ఛగా, నేరుగా అభిప్రాయాలను పంచుకునే ఇలాంటి చర్చల్ని మున్ముందు కూడా మరిన్ని చేపట్టాలని ఇరువురు నేతలూ నిర్ణయించుకోవడం భవిష్యత్‌లో మరిన్ని సముచితమైన.. సమున్నతమైన చర్చలకు బాటలు వేసుకున్నట్లే. అదేవిధంగా ఉగ్రవాదం విసురుతున్న ఉమ్మడి సవాళ్ళను గుర్తించి, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో సహకారాన్ని మరింత పెంచుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించుకోవడం ఎంతైనా హర్షించదగిన విషయం. అయితే ఈ నేపథ్యంలో ఉగ్రవాదానికి పుట్టినిల్లుగా మారి భారత్‌పై కుట్రలు చేస్తున్న పాక్ విషయంలో చైనా ఇకమీదట ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచిచూడాల్సిందే.

ఏదేమైనా, ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడున్న అస్థిర పరిస్థితుల్లో, ప్రపంచ మానవాళిలో మూడోవంతుకు ప్రాతినిధ్యం వహిస్తూ, ప్రపంచంలోని రెండు అతిపెద్ద దేశాలుగా ఉన్న చైనా-భారత్‌లు రెండూ సరిహద్దుల్లో శాంతి సామరస్యతలకు బాటలు వేసుకుంటూ మంచినిర్ణయాలు తీసుకోవడం ఇరుదేశాలకూ శుభ పరిణామమే. రెండుదేశాల స్నేహానుబంధం మరింతగా బలోపేతం కావడానికి ఈ నిర్ణయాలు ఎంతగానో దోహదం చేస్తాయనడంలో సందేహం లేదు. భవిష్యత్తులో ఈ బంధం మరింత దృఢం కావాలి. సరిహద్దుల్లో శాంతి సామరస్యతలకు ఎలాంటి విఘాతం లేకుండా చూసుకోవాలి. ఎలాంటి పొరపొచ్చాలకు తావులేకుండా ఇరుదేశాలు అన్ని విషయాల్లోనూ చిత్తశుద్ధితో సహకరించుకుంటూ మరింత ప్రగతి సాధించాలి. అప్పుడే ఇలాంటి చర్చలకు సార్థకత. ఏదేమైనా ప్రధాని మోడీ చైనా పర్యటన విజయవంతమైనట్లే!..భారత్-చైనా తాజా చర్చలు ఫలప్రదం కావడం..ఇరుదేశాల నడుమ మైత్రీబంధం మరింతగా పెనవేసుకున్నట్లే!....

---

### శ్రీనేతాజీ విద్యార్థికి

## జాతీయస్థాయి అవార్డు

నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అసోసియేషన్ (ఎన్ఐఎస్ఏ) ఆధ్వర్యంలో జనవరి 28న నిర్వహించిన నేషనల్ అనలెటికల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ప్రవేశపరీక్షలో శ్రీ నేతాజీ విద్యార్థి జోయెల్ అనురాగ్ తన ప్రతిభను చాటి జాతీయస్థాయి అవార్డు సాధించారని ఆ సంస్థ ప్రిన్సిపల్ ఎం.వి సుబ్బారెడ్డి తెలియజేశారు.

దేశవ్యాప్తంగా ఈ పరీక్షలకు సుమారు పాతికవేల మంది హాజరు కాగా, మన రాష్ట్రం నుంచి 11వేల మంది హాజరయ్యారని, వీరిలో కేవలం ఆరుగురు విద్యార్థులు మాత్రమే ఎంపికయ్యారని తెలిపారు. టాప్12లో శ్రీ నేతాజీ(ఎమ్మెస్సార్) విద్యార్థి అనురాగ్ ఎన్నికై పాతికవేల రూపాయల నగదు అవార్డును సాధించడం తమకెంతో గర్వకారణమన్నారు. ఢిల్లీలో జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎన్ఐఎస్ఏ అధ్యక్షుడు కుల్‌భూషణ్‌శర్మ, అపస్మా ప్రెసిడెంట్ విషాల్ గున్ని చేతుల మీదుగా తమ విద్యార్థి ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అనురాగ్‌ను ఆయన అభినందించారు.

## చెస్‌లో మధుసూదన్ ప్రతిభ

నెల్లూరు నారాయణ దంతవైద్యకళాశాల విద్యార్థి ఇ.మధుసూదన్‌రెడ్డి చెస్‌లో తన ప్రతిభ చూపుతూ రాణిస్తున్నాడు. జాతీయ స్థాయి చెస్ పోటీలకు కూడా ఆ విద్యార్థి ఎంపికయ్యాడు.

ఇటీవల కడప జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి రాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచాడు. 7 రౌండ్లకుగాను 6 పాయింట్లు సాధించి ఆ పోటీల్లో విజయం సాధించి, అహ్మదాబాద్‌లో జరిగే జాతీయస్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి వై.సుమన్ మాట్లాడుతూ, మధుసూదన్‌రెడ్డి జాతీయస్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.

### చంద్రప్రభపై...

## కాశీవిశ్వనాథుడు

నెల్లూరు ఉస్మాన్‌సాహెబ్‌పేటలో ఉన్న అన్నపూర్ణ సమేత శ్రీ కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో ఎంతో వేడుకగా నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గతనెల 27వ తేది రాత్రి స్వామివారిని చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు.

కన్నుల పండువగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వందవాశి విశ్వనాథ గురుకుల్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, సేవలు చేశారు. ఇడుముకంటి కృష్ణారెడ్డి, రామలక్ష్మమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని వేడుకలను తిలకించారు.

### చంద్రమౌళీశ్వరాలయంలో

## చండీహోమం

నెల్లూరు నగరంలోని మూలాపేటలో ఉన్న కంచి కామాక్షితాయి శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి దేవాలయంలో గతనెల 29న ఎంతో భక్తిశ్రద్ధలతో చండీహోమం నిర్వహించారు. వేదపండితుడు సోమేశ్వరశర్మ(భీమవరం) నేతృత్వంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సాయికిరణ్‌స్వామి ఆధ్వర్యంలో పరమేశ్వరునికి, అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. చండీహోమం అనంతరం భక్తులందరికీ అన్నదాన వితరణ గావించారు. ఆలయ మేనేజర్ నందకిషోర్, కార్యనిర్వాహకురాలు ఉషాకుమారి ఈ వేడుకలను పర్యవేక్షించారు.




## వాళ్ళు మారాలి!

ప్రజా జీవితంలో వుండే నాయకులు మతపరమైన కార్యక్రమాలలో పాల్గొనవచ్చుగాని మత ప్రచార సభలలో పాల్గొనకూడదు. వై.యస్.రాజశేఖరెడ్డి క్రిస్టియన్ అయినప్పటికీ అన్ని మత సంస్కృతులను గౌరవించేవాడు. కాని, ఆయన కుటుంబసభ్యులైన భార్య, కూతురు, అల్లుడులు క్రైస్తవ మత ప్రచార సభలలో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. క్రైస్తవాన్ని విశ్వసించడం, ప్రభువును ప్రార్థించడం, క్రైస్తవ మత పండుగలు జరుపుకోవడం వారి వ్యక్తిగత ఇష్టం. దానిని ఎవరూ ఆక్షేపించరు. కాని, ఒక మతానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలలో పాల్గొనడం ఇతర మతాల వారిని బాధిస్తోంది. ఒక మతపరమైన ముద్రను వేసుకోవడం ప్రజాజీవితంలో వుండాలనుకుంటున్న వారికి సముచితం కాదు.

– గ్రంధి కోటేశ్వరరావు, నెల్లూరు.

## కుంభకోణాల కాంగ్రెస్ వద్దు

రోగం వస్తే వేసుకునే టాబ్లెట్ చేదుగానే వుంటుంది. డాక్టర్ పొడిచే ఇంజక్షన్ నొప్పిగానే వుంటుంది. పళ్ళు తోమడానికి వాడే పేస్ట్ తియ్యగాను, వేపపుల్ల చేదుగాను వుంటుంది. కాని ఆ చేదే వంటికి మంచిది. ఆ చేదును మింగితేనే మనిషి ఆరోగ్యవంతుడు కాగలడు. అంతేగాని చక్కెర తియ్యగా వుందని రోజూ తింటే రోగాల పాలవుతారు. కాంగ్రెస్‌పార్టీ కూడా చక్కెర లాంటిదే! తినడానికి తియ్యగా వుంటుంది. కొన్నేళ్ళ తర్వాత చూస్తే ఒళ్ళు గుల్లయి వుంటుంది. అలాంటి కాంగ్రెస్ చక్కెర పాలన మనకొద్దు. జీఎస్టీ, నోట్ల రద్దు వల్ల తాత్కాలిక కష్టాలు, నష్టాలుండవచ్చు. కాని భవిష్యత్‌లో వాటి ప్రయోజనాలు ఎంతో బాగుంటాయి. తాత్కాలికంగా ఏదో కష్టం వచ్చిందనే కోపంతో నీతిగా, నిజాయితీగా పనిచేస్తున్న మోడీ పాలనను వ్యతిరేకించడం మూర్ఖత్వమే అవుతుంది.

– సి.వెంకట్, హైదరాబాద్.

## మరపురాని మనిషి

మనిషన్నాక చావు పుట్టుకలు సహజం. మరణించిన మనిషిని కొంత కాలానికి మరచిపోవడం ఇంకా సహజం. అయితే స్టైల్ ఆఫ్ సింహపురిగా పేరుబడ్డ ఆనం వివేకానందరెడ్డి మరచిపోలేని మనిషి. నెల్లూరుజిల్లాలోనే ఆయనొక డిఫరెంట్ లీడర్. నిత్యం ప్రజల్లో వున్న నాయకుడు. ఆయన వేషాలు, హావభావాలు, వ్యంగ్య విమర్శలు కళ్ళ ముందు నిత్యం మెదులుతూనే వుంటాయి. జిల్లా రాజకీయాలలో ఆయనలేని లోటును ఎవరూ తీర్చలేరు.

సానా నగేష్‌రెడ్డి, నెల్లూరు.

# నిజాయితీని నిరూపించుకో..!

## - ఎస్పీకి కోటంరెడ్డి సవాల్



క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో జిల్లా ఎస్పీ రామకృష్ణ వ్యవహారశైలి చట్టానికి విరుద్ధంగా వుందని, అధికార పార్టీకి తొత్తుగా మారి ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను వేధిస్తున్నాడని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు.

గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఎస్పీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నేను బుకీలను విడిపించమని పోలీసు అధికారుల మీద ఒత్తిడి తెచ్చానని నాపై కేసు పెట్టారు. నేను ప్రతిపక్ష ఎమ్మెల్యేని... ఒకటికి నాలుగుసార్లు అడిగితే కూడా పోలీసులు ఓ చిన్న పని చేయరు. అలాంటిది నేను చెబితే బుకీలను వదిలేస్తారా? మరి అలా వదిలేస్తే సిఫార్సు చేసిన నాతోపాటు వదిలేసిన పోలీసు అధికారుల మీద కూడా కేసులు పెట్టాలి కదా! మరి ఎంతమంది పోలీసు అధికారుల మీద కేసులు పెట్టారని ఆయన ప్రశ్నించారు. మీరు పిలిస్తే ఒకటికి రెండుసార్లు విచారణకొచ్చాను. బెట్టింగ్ కేసులో ఎమ్మెల్యేల ప్రమేయం లేదని మీరే చెప్పారు. మళ్ళీ ఇంకో కేసులో విచారణ అంటూ నోటీసులు పంపిస్తారా?

మీరు పిలిచినప్పుడల్లా రాకుంటే పరారీలో వున్నాడని రాస్తారా? ఎవరు ఎక్కడున్నారో, ఎవరు ప్రజల మధ్య వున్నారో తెలియదా? నేను నిజాయితీపరుడునని ట్యాగ్ తగిలించుకుని తిరగడం కాదు, మీ నిజాయితీని నిరూపించుకోవాలంటే బెట్టింగ్ మాఫియాపై సిబిసిఐడి, ఏసిబి విచారణకు ఆదేశించండి... బుకీల కాల్స్ డేటా తీయండి. వాళ్ళు ఎవరెవరికి ఫోన్‌లు చేసారు, ఎవరెవరెవరికి డబ్బులు ఇచ్చారు, ఎవరికి యాడ్స్ ఇచ్చారు, ఎవరికి విందులిచ్చారో తేలుతుంది. ఆ విచారణలో బయటపడ్డ నాయకులందరిపై కేసులుపెట్టి అరెస్ట్ చేయండి... అప్పుడు మీ ఆఫీసు ముందుకొచ్చి మీ నిజాయితీకి సెల్యూట్ చేస్తా... మీపట్ల తప్పు చేసానని చెంపలేసుకుంటా... మీ తప్పుడు కేసులకు భయపడే వాడిని కాదు. బెట్టింగ్‌పై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి మీ నిజాయితీని నిరూపించుకోండంటూ ఆయన ఎస్పీకి సవాల్ విసిరాడు.

# నెల్లూరులో నరసింహన్



స్పాస్టిక్ సెంటర్‌లోని చిన్నారులతో గవర్నర్ నరసింహన్ దంపతులు, మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తదితరులు

ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ సతీసమేతంగా నెల్లూరొచ్చారు. 2వ తేదీ రాత్రి చెన్నై నుండి హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరుకు చేరుకున్న గవర్నర్ దంపతులకు రైల్వేస్టేషన్‌లో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, కలెక్టర్ ముత్యాలరాజు, ఎస్పీ రామకృష్ణ, మేయర్ అబ్దుల్ అజీజ్, జాయింట్ కలెక్టర్ వెట్రి సెల్వీ ఘనస్వాగతం పలికారు. గవర్నర్ దంపతులు ఆ రాత్రికి ఆర్ అండ్ బి అతిథిగృహంలో బస చేశారు. 3వ తేదీ ఉదయం మద్రాసుబస్టాండ్ వద్దనున్న రెడ్‌క్రాస్ కార్యాలయంకు చేరుకుని ఇక్కడ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాగుంట సుబ్బరామరెడ్డి స్పాస్టిక్ సెంటర్, జక్కా సుజాతమ్మ క్యాన్సర్ నిర్ధారణ కేంద్రాలను కూడా ఆయన సందర్శించారు. స్పాస్టిక్ సెంటర్‌లో చిన్నారులతో ముచ్చటించారు. క్యాన్సర్ ఆసుపత్రిలో రోగులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ నరసింహన్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ అంటే కేవలం రక్తం సేకరించేదే కాదని, తెలుగు రాష్ట్రాలలో రెడ్‌క్రాస్ సొసైటీలు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. పేద మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. వైద్య సదుపాయం కోసం ఆర్థిక సాయం అందించే ప్రతిఒక్కరికీ దేవుడి దీవెనలుంటాయని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, కలెక్టర్ ముత్యాలరాజు, రాష్ట్ర రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు యస్.బాలసుబ్రహ్మణ్యం, రెడ్‌క్రాస్ నెల్లూరు శాఖ గౌరవఅధ్యక్షులు డాక్టర్ ఏవిఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



జక్కా సుజాతమ్మ క్యాన్సర్ సెంటర్‌ను పరిశీలిస్తున్న గవర్నర్ నరసింహన్

# జిఎస్టీలో సెంచరీ కొట్టాం!

## - వాణిజ్యపన్నులశాఖ జేసీ కృష్ణమోహన్‌రెడ్డి



వాణిజ్య పన్నుల శాఖ నెల్లూరు డివిజన్ జిఎస్టీ అమలులో శాస్త్రీయంగా వ్యవహరించడం వల్ల ఏడాదిలోపు మొదటిసారిగా ఒకే నెలలో 100 కోట్ల రెవిన్యూ ఆదాయం దాటిందని ఆ శాఖ జాయింట్ కమిషనర్ ఎస్ఇ కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో తీసుకున్న సానుకూల ధోరణులు, వ్యాపారుల రిటర్న్‌లు ఫైలింగ్, రవాణా, వాహన తనిఖీలు విస్తృతంగా చేపట్టడం, ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలను తనిఖీలు చేయడం జరిగిందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. నెల్లూరు డివిజన్ మార్చి 2018 ఆర్థిక సంవత్సరానికి 101.32 కోట్లు ఆదాయం సాధించిందని ఆయన వివరించారు. రాష్ట్రస్థాయిలో రెవిన్యూ సంపాదించడంలో ఈ డివిజన్ 5వ స్థానంలో నిలిచిందన్నారు.





ఉత్తరక్రియలు

మంచితనం, మానవత్వం మూర్తీభవించిన
మా ఇంటిదైవం
శ్రీ బద్వేలు కృష్ణారెడ్డి గారు
తేది 01-05-2018 మంగళవారం
నాడు స్వర్గస్తులైనారు.
వారి ఆత్మకు శాంతిని కలుగజేయమని
భగవంతుని ప్రార్థిస్తున్నాము.

భార్య : బద్వేలు యశోదమ్మ

తమ్ముళ్లు : బద్వేలు శ్రీనివాసులురెడ్డి,
బద్వేలు సుధాకర్‌రెడ్డి

అన్న / తమ్ముని కుమారులు : బద్వేలు హరిప్రసాద్‌రెడ్డి
బద్వేలు సుబ్బారెడ్డి
బద్వేలు ప్రదీప్‌రెడ్డి
బద్వేలు కిరణ్‌కుమార్‌రెడ్డి
బద్వేలు శ్రావణ్‌కుమార్‌రెడ్డి
మరియు కుటుంబసభ్యులు

ఉత్తరక్రియలు : తేది 19-05-2018 శనివారం నాడు నెల్లూరు చిల్డ్రన్స్‌పార్కు ఎదురుగాగల పావని ఎలైట్‌లోని మా స్వగృహమునందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది. ఫోన్ : 99494 03599, 94411 12030.

# చదువుల కీర్తికి గవర్నర్ అభినందన


లక్ష్మీకీర్తిని పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న గవర్నర్ నరసింహన్, పక్కన కె.వి.రత్నం

2018 సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాలలో రాష్ట్ర స్థాయి మొదటి స్థానం సాధించిన రత్నం విద్యాసంస్థల విద్యార్థిని లక్ష్మీకీర్తిని ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ అభినందించారు. 2వ తేదీ నెల్లూరు వచ్చి ఆర్ & బి అతిథి గృహంలో బస చేసిన ఆయనను గురువారం రత్నం విద్యాసంస్థల అధినేత కె.వి.రత్నం, ర్యాంకర్ లక్ష్మీకీర్తి కలిసారు. ఈ సందర్భంగా లక్ష్మీకీర్తిని గవర్నర్ అభినందిస్తూ నీట్‌లో కూడా మంచి ర్యాంక్ సాధించి డాక్టర్ కావాలని ఆశీర్వదించారు.

ఈ సందర్భంగా రత్నం మాస్టారు తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ 2016 సంవత్సరంలోనూ ఎంసెట్‌లో రాష్ట్ర స్థాయి మొదటిర్యాంకు సాధించిన మా విద్యార్థిని హేమలతను మీరు ఆశీర్వదించారని, మీ ఆశీస్సుల బలంతో ఆ విద్యార్థిని భోపాల్‌లో ఏఐఐఎంఎస్ చదువుతోందని గవర్నర్‌కు తెలిపారు. ఇది విని గవర్నర్ ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్, నీట్, ఎయిమ్స్ మరియు ఎంసెట్‌లలో ప్రతియేటా మంచి ఫలితాలు సాధిస్తున్నామని రత్నం మాస్టారు గవర్నర్‌కు తెలియజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీకీర్తి తన విజయానికి రత్నం మాస్టారు మరియు అధ్యాపకులే కారణమని, వారికి రుణపడి ఉంటానని చెప్పింది. చదువుల్లో మంచి ఫలితాలు సాధిస్తున్న రత్నం మాస్టారును ఈ సందర్భంగా గవర్నర్ నరసింహన్ అభినందించారు.

# పోర్టు కోసం పోరు

## బీద సోదరుల నాయకత్వంలో రామాయపట్నం ఉద్యమం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

నెల్లూరుజిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి స్వర్ణయుగంగా దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి పరిపాలనా కాలాన్ని చెప్పుకోవచ్చు. జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి బీజం వేసింది ఆయనే! పరిశ్రమలను తెప్పించి కొన్ని లక్షల మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పించింది ఆయనే!

అయితే 2004-2009ల మధ్య జరిగిన పారిశ్రామికాభి వృద్ధి అంతా కూడా నెల్లూరుకు దక్షిణం వైపే జరిగింది. కృష్ణపట్నం పోర్టు, మాంబట్టు, మేనకూరు, చింతవరం, శ్రీసిటి సెజ్‌లన్నీ కూడా దక్షిణం వైపే వచ్చాయి. వై.యస్. 2009 ప్రాంతంలో నెల్లూరుకు ఉత్తరం వైపు కూడా దృష్టిపెట్టి రాచర్లపాడు ఇఫ్కో సెజ్, దగదర్తి ఎయిర్‌పోర్టు వంటి వాటి నిర్మాణానికి శ్రీకారం చుట్టాడు. 2009లో రెండోసారి సీఎం అయ్యాక ఆయన పూర్తికాలం వుండుంటే పారిశ్రామికంగా నెల్లూరు ఉత్తరం వైపు కూడా అభివృద్ధి చెంది ఉండేదేమో? కాని ఆయన హఠాన్మరణంతో నెల్లూరుకు ఉత్తరం వైపు ప్రాంత అభివృద్ధి ఆగిపోయింది.

వై.యస్. తర్వాత సీఎంలైన రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిల హయాంలో దగదర్తి ఎయిర్‌పోర్టు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న రీతిలో వుండిపోయింది. 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక దగదర్తి ఎయిర్ పోర్టు కోసం బీద సోదరులు గట్టిగానే ప్రయత్నించారు. ఒక దశలో దగదర్తిలో ఇక ఎయిర్ పోర్టు లేదు అనుకున్న తరుణంలో బీద సోదరులే ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి అక్కడ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కావాల్సిన అనుమతులు, భూసేకరణ వంటివి తొందరగా అయ్యేలా చేశారు. అయితే ఎయిర్‌పోర్టుకు ఇంకా శంకుస్థాపన జరగకపోవడం లోటే! ఇప్పుడు శంకుస్థాపన చేసినా విమానం దిగడానికి ఇంకెన్నేళ్ళు పడుతుందో!

తాజాగా రామాయపట్నం పోర్టు అంశం తెరమీదకొచ్చింది. గత యూపిఏ ప్రభుత్వంలోనే నెల్లూరుజిల్లా దుగరాజపట్నం వద్ద కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పోర్టును నిర్మించాలని నిర్ణయించారు. విభజన హామీలలో కూడా దుగరాజపట్నంను చేర్చారు. అయితే ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక దుగరాజపట్నం వెనక్కుపోయింది. భద్రత రీత్యా షార్ అభ్యంతరాలు, పులికాట్ సరస్సుకు ముప్పుందనే పర్యావరణ శాఖ హెచ్చరికలతో దుగరాజపట్నం పోర్టుకు బ్రేకులు వేసినట్లయ్యింది. దీంతో ప్రత్యామ్నాయంగా నెల్లూరు-ప్రకాశం జిల్లాల సరిహద్దులో వుండే రామాయపట్నం పోర్టు తెరమీద కొచ్చింది. రామాయపట్నం పోర్టు సాధన సమితి ఏర్పడింది. దీని కోసం కావలి కేంద్రంగా ఉద్యమాలు మొదలయ్యాయి. ఆ మధ్య వంటేరు వేణుగోపాలరెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలు కావలి నుండి రామాయపట్నం వరకు పాదయాత్ర నిర్వహించారు.

కాగా, ఇప్పుడు బీద సోదరులు దీనిని మరింత ముందుకు కదిలించారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దుగరాజపట్నంకు ప్రత్యామ్నాయంగా రామాయపట్నం పోర్టును పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పుడు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మాజీఎమ్మెల్యే బీద మస్తాన్‌రావులు కావలి ప్రాంత అభివృద్ధికి రామాయ పట్నం ప్రధాన వేదిక అని ఆ పోర్టు సాధనే తమ ధ్యేయమంటూ పోర్టు సాధన కోసం అందరినీ కలుపుకుపోయే విధంగా శ్రీకారం చుట్టారు. ఇటీవల నెల్లూరులోని మాగుంట వాళ్ళ కార్యాలయంలో దీనికి సంబంధించిన సమావేశం బీద రవిచంద్ర నేతృత్వంలోనే జరిగింది. ప్రకాశం జిల్లా నేతలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, కరణం బలరాం, దివి శివరాంలతో పాటు నెల్లూరుజిల్లాలో కావలి, ఉదయగిరి నియోజకవర్గాలకు చెందిన పలు పార్టీల నాయకులు కూడా ఈ సమావేశానికి హాజరై బీద సోదరుల ఆలోచనలకు, రామాయపట్నం పోర్టును సాధించాలన్న వారి సంకల్పానికి మద్దతు పలికారు. రామాయపట్నం పోర్టును సాధించాలన్న బీద బ్రదర్స్ తపన, ఆలోచన బాగానే వుంది. దానికి తగ్గ సాధ్యాసాధ్యాలను కూడా పరిశీలించాలి. పోర్టును తెచ్చి బెర్తులు కట్టగానే సరికాదు, దానికి సరిపడా ఎగుమతులు, దిగుమతులు జరగాలి. అలా జరగాలంటే ముందు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసే దిశగా బీద సోదరులు ఆలోచన చేయాల్సివుంది.






# ఆనం కుటుంబానికి అంతులేని వెలితి



నెల్లూరుజిల్లాలో దాదాపు ఏడు దశాబ్దాల రాజకీయ చరిత్ర వున్న కుటుంబం ఆనం. ఏ.సి.సుబ్బారెడ్డి, ఆనం వెంకటరెడ్డి, ఆనం సంజీవరెడ్డి, ఆనం వివేకానందరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి... నాటి నుండి నేటివరకు ఏ పార్టీ ద్వారానైనా సరే రాజకీయ తెరపై మెరుస్తూ వచ్చిన నాయకులు. ఆనం కుటుంబంలో చెప్పుకోదగ్గ గొప్ప నాయకుడు ఏ.సి.సుబ్బారెడ్డి. మున్సిపల్ ఛైర్మెన్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా ఆయన పేరు ఇప్పటికీ మార్మోగుతూనే ఉంటుంది. అయితే ఏ.సి.సుబ్బారెడ్డి నాయకత్వ పరంగా, పరిపాలనా పరంగా ప్రజాభిమానం పొందాడు.

కాని, ఆనం వివేకా అలా కాదు. ఆయన అన్ని విధాలా ప్రజల్లోకి వెళ్ళాడు. మున్సిపల్ ఛైర్మెన్‌గా వున్నా, ఎమ్మెల్యేగా పనిచేసినా నిత్యం ప్రజల మధ్యే గడిపాడు. ఆయన ఎన్నికల్లో పోటీ చేసింది, ప్రజల్లో నిలిచింది, గెలిచింది అంతా ఒకెత్తు.

ఏ.సి.సుబ్బారెడ్డి, ఆనం వెంకటరెడ్డిల తర్వాత వారి వారసత్వ రాజకీయాన్ని నిలబెట్టింది, ఆనం బ్రాండ్ ఇమేజ్‌ని కాపాడింది వివేకానే! 1983లో తన తమ్ముడు ఆనం రామనారాయణరెడ్డికి తనకంటే ముందే ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశమొచ్చినా ఆయన గెలుపు కోసం పని చేసాడే కాని తనకు టిక్కెట్ కావాలని మంకుపట్టు పట్టలేదు. వై.యస్. కేబినెట్‌లో అన్నదమ్ములిద్దరూ ఎమ్మెల్యేలైనప్పటికీ తన తమ్ముడినే మంత్రిని చేయాలనుకున్నాడు గాని తాను మంత్రి కావాలనుకోలేదు. జిల్లాలో రాజకీయాలలో తన ప్రస్థానం మొదలైనప్పటి నుండి ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నాడు. వర్గ రాజకీయాల చదరంగంలో జయాపజయాలు చూసాడు. సొంత పార్టీలో ప్రత్యర్థులను, అవతల పార్టీలో ప్రత్యర్థులను ఏక కాలంలో ఎదుర్కొన్నాడు.

ముఖ్యంగా వివేకా వ్యూహాలు రాజకీయంగా వేసే అడుగులు ఎవరికీ అర్థం కావు. నింద మీద పడ్డా చివరకు తమదే పైచేయి అనిపించేవాడు. జిల్లాలో నల్లపరెడ్డి, మాగుంట, మేకపాటి, నేదురుమల్లి వంటి కాకలు తీరిన రాజకీయ కుటుంబాలను ఢీకొట్టి నిలిచాడు. ఇంత కాలం వివేకా మార్గదర్శకత్వంలోనే ఆనం రాజకీయం నడిచింది. ఈరోజు ఆ కుటుంబానికి దారిచూపించే నాయకుడు లేడు. ఆయన లేని వెలితి ఆ కుటుంబానికి తీర్చలేనిదే!

## ఎంసెట్‌లో 'నారాయణ' ప్రభంజనం

ప్రభుత్వం విడుదల చేసిన ఎంసెట్ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ విద్యాసంస్థల మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు హరనాథపురం లోని నారాయణ కళాశాలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బైపిసి విభాగంలో చేజర్ల నరేన్‌రెడ్డి 73వ ర్యాంకు, ఎంపిసి విభాగంలో పి.కార్తీక్ 144వ ర్యాంకును సాధించి జిల్లాలో ప్రథమస్థానం సాధించారన్నారు. బైపిసి విభాగంలో రాష్ట్రస్థాయిలో 107, 142, 195, 218, 263 ర్యాంకులతో పాటు వెయ్యి లోపు 23 మంది, రెండువేల లోపు 58 మంది, 5వేల లోపు 119 మంది, 10వేల లోపు 204 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు. అదేవిధంగా, ఎంపిసి విభాగంలో రాష్ట్ర స్థాయిలో 144, 145, 185, 199, 281 ర్యాంకులతో పాటు వెయ్యి లోపు 18మంది, 2వేల లోపు 41మంది, 5వేల లోపు 109 మంది, 10వేల లోపు 231 మంది, 30వేల లోపు 862 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని ఆయన వివరించారు.

# చతుర్ధ వర్ధంతి



జననం
09.09.1964

మరణం
06.05.2014

మా ఇంటి ఆశాదీపం

## జక్కా రామ్‌మోహన్‌రెడ్డి

పరమపదించి తే. 6.5.2018ది నాటికి నాలుగు సంవత్సరాలు గడుస్తాయి.

వారి దివ్యస్మృతిలో...

నానమ్మ : జక్కా కామేశ్వరమ్మ

నాన్న : జక్కా కోదండరామిరెడ్డి
మాజీ శాసనసభ్యులు

అమ్మ : జక్కా సులోచనమ్మ

భార్య : జక్కా వినుజరెడ్డి

కుమార్తె : జక్కా రిధిరెడ్డి

కుమారుడు : జక్కా మనవ్‌రెడ్డి

తమ్ముడు : జక్కా జనార్ధన్‌రెడ్డి

మరదలు : జక్కా స్మితరెడ్డి

తమ్ముని కుమారుడు : జక్కా కోదండ శ్రీవత్స

చెల్లెలు : పద్మజ

బావ : ఎ.బి.వి.రమణారెడ్డి

చెల్లెలి కుమార్తెలు : ప్రియదర్శిని వెంకట్, యామిని వెంకట్

## నెల్లూరు కబుర్లు



# విశాఖకు వెళ్లొచ్చిన నెల్లూరు నేతలు!

ఏప్రిల్ 30వ తేదీన విశాఖలో నిర్వహించిన వంచన దీక్ష కార్యక్రమానికి నెల్లూరు జిల్లా నుండి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్ళారు. జిల్లాకు చెందిన వైకాపా ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వరప్రసాద్, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, కిలివేటి సంజీవయ్య, మేకపాటి గౌతంరెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, నాయకులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు విశాఖ దీక్ష సభలో పాల్గొన్నారు. మరో నెల్లూరీయుడైన ఎంపీ వి.విజయ సాయిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం దిగ్విజయం కావడం విశేషం.

# కలెక్టరేట్‌లో మజ్జిగ చలివేంద్రం



అర్జీదారులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు

ప్రతి సోమవారం గ్రీవెన్స్‌డే కోసం వచ్చే అర్జీదారులను దృష్టిలో పెట్టుకుని విజయ డెయిరీ వారు నెల్లూరు కలెక్టరేట్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు ఈ చలివేంద్రాన్ని ప్రారంభించి, ప్రతి సోమవారం జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుండి ప్రజలు కలెక్టరేట్‌కు వస్తుంటారని, ఎండనపడి వస్తున్న వాళ్ళకు ఈ మజ్జిగ చలివేంద్రం దాహార్తి తీరుస్తుందంటూ విజయ డెయిరీ వారిని అభినందించారు. పాలకమండలి సభ్యులందరి సహకారంతో ఈ మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసామని విజయడెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తెలిపారు.

# తెలుగు సాహిత్యంలో నానీలకు విశిష్ట స్థానం

## - సోమిరెడ్డి జమున స్మారక సాహితీ సభలో ప్రభు



సోమిరెడ్డి జమున స్మారక సాహితీ పురస్కారాన్నందుకుంటున్న గోపీనాథ్

తెలుగు సాహిత్యంలో నానీలకు విశిష్ట స్థానం ఉందని 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి పేర్కొన్నారు. పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో గత నెల 29న నెల్లూరు టౌన్‌హాలు ప్రాంగణంలోని జూనియర్ రేబాల లక్ష్మీ నరసారెడ్డి స్మారక భవనం ఏసి హాల్‌లో సోమిరెడ్డి జమున స్మారక సాహితీ అవార్డు -2018 ప్రదానోత్సవ సభకు ఆయన సభాధ్యక్షులుగా వ్యవహరించి మాట్లాడుతూ నానీల ప్రక్రియ క్లుప్తంగా, సూటిగా హృదయాలను తాకుతుందన్నారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి జమున స్మారక రాష్ట్రస్థాయి సాహితీ పురస్కారాన్ని "నానీల వాణి" రచయిత ఎరుకలపూడి గోపీనాథ్‌రావుకు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథులుగా ఏపి రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు, కవి, విమర్శకులు కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాహితీ అవార్డు వ్యవస్థాపకురాలు, రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి రచించిన "కొత్త దేహాలు" కవితా సంపుటిని ముఖ్యఅతిథులు ఆవిష్కరించారు. ఆంధ్రప్రభ సాహితీ విభాగం సంపాదకులు నియోగిని సత్కరించారు. పెరసం అధ్యక్షులు అవ్వారు శ్రీధర్‌బాబు, బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజుల సుభద్రాదేవి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో రచయిత్రి పాతూరి అన్నపూర్ణ, డా॥ ఈదూరు సుధాకర్, కవులు, రచయితలు పాల్గొన్నారు.



"కొత్త దేహాలు" కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

# ప్రగతి చారిటీస్‌కి విపిఆర్ విరాళం

## • సేవా కార్యక్రమాలకు 3 లక్షలు సాయం

నెల్లూరులోని ప్రగతి చారిటీస్‌కు ప్రముఖదాత, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డి దంపతులు 3 లక్షల రూపాయలు విరాళంగా అందజేసి తమ వితరణగుణాన్ని చాటుకున్నారు.

గత నెల 28న వారు ఆ సాయాన్ని ప్రగతికి అందించారు. ప్రగతి చారిటీస్ వారు నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాలకు గత దశాబ్దకాలంగా తాను అందిస్తున్న చేయూతలో భాగంగా ఈ విరాళం అందించామని ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు.



# నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన 'వాత్సల్య'



విద్యార్థులను అభినందిస్తున్న సామంతు గోపాలరెడ్డి

నెల్లూరులోని కొండాయపాళెం రోడ్డులో జనహిత-వాత్సల్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారతీయ విద్యా వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు టెన్త్‌లో నూరుశాతం విజయాన్ని సాధించడమే కాక, పి.లావణ్య అనే విద్యార్థిని 10కి 10 జిపిఏ సాధించి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.

అనాథ, నిరాధార బాలబాలికల మరియు పేద, బడుగువర్గాల పిల్లలకు అత్యుత్తమ విద్యను అందిస్తోన్న ఈ హైస్కూలు విద్యార్థులు 24మంది టెన్త్ పరీక్షలకు హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణులై ఆ పాఠశాల పేరును నిలబెట్టారు. అంతే కాక, పి.లావణ్య 10కి10 జిపిఎ సాధించగా, ముగ్గురు 9.7, ఇద్దరు 9.5, మరో ముగ్గురు 9 జిపిఎ సాధించారు. కేవలం నిరాధారులైన పిల్లలు, నిరుపేద బడుగు వర్గాల పిల్లలు ఇంత అత్యుత్తమ రీతిలో చదువుకుని మంచి ఉత్తీర్ణత సాధించడం ఎంతో విశేషం. ఈ సందర్భంగా జనహిత -వాత్సల్య గౌరవాధ్యక్షుడు సామంతు గోపాల్‌రెడ్డి అత్యుత్తమ జిపిఏ సాధించిన పిల్లలను అభినందించారు. 10కి10 జిపిఏ సాధించిన పి.లావణ్యకు వెయ్యి న్నూటపదహారు రూపాయలు, 9.7 జిపిఏ సాధించిన కె.నవీన్‌రెడ్డికి 516 రూపాయలు బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సహకార్యదర్శి టివిఎస్ దుర్గాప్రసాద్, సంఘటన కార్యదర్శి జి.వి సాంబశివరావు, హైస్కూలు హెడ్‌మాస్టర్ ఎం.మధుసూదన్‌రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# భగవత్ భక్తికన్నా మించినదేమీ లేదు

## - ఇస్కాన్ అధ్యక్షుడు శుకదేవస్వామి



నృసింహ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న శుకదేవస్వామి

భగవత్ భక్తి ఎంతో గొప్పదని, దానిని మించిన శక్తివంతమైనదేమీ లేదని భగవత్ భక్తుడు ప్రహ్లాదుడు నిరూపించాడని, భక్తులను అన్ని వేళలా ఆ భగవంతుడు రక్షిస్తాడని నరసింహావతారం ద్వారా మనకు సుబోధకమవుతుందని ఇస్కాన్ మందిర అధ్యక్షుడు శుకదేవస్వామి అన్నారు.

శ్రీ నృసింహ జయంతి సందర్భంగా గతనెల 29వ తేది రాత్రి నెల్లూరులోని ఇస్కాన్ మందిరంలో ఘనంగా జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శుకదేవస్వామి మాట్లాడుతూ, భక్తుడు భగవంతుని కైంకర్యంలోనే నిజమైన ఆత్మానందం పొందుతాడని అన్నారు. అందుకు ప్రహ్లాదుడే ప్రతీక అని, ప్రహ్లాదుని భగవద్భక్తి సాటిలేనిదని అన్నారు. మానవుల్లో అత్యధికులు ఇతర విషయాలపట్ల నిమగ్నమై ఉంటున్నారని, అందువల్ల ప్రయోజనమేమీ ఉండదని అన్నారు. భగవంతుని తెలుసుకోవడం, ఆ దైవాన్ని ఆరాధించడమనేది ఒక్క మానవజన్మలోనే సాధ్యమని, భగవద్భక్తితో జీవితాన్ని సాగించడం ద్వారా మన జన్మను సార్థకం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కలికాలంలో 'హరే కృష్ణ' మహామంత్రం ద్వారా భగవంతుని కరుణను పొందవచ్చన్నారు. అనంతరం ప్రదర్శితమైన 'ప్రహ్లాద' నాటకం భక్తులందరినీ బాగా ఆకట్టుకుంది.

# జపాన్ పోటీలకు నెల్లూరీయులు

జపాన్‌లోని టోక్యోలో జరుగుతున్న జపాన్ ఓపెన్ మెమోరి ఛాంపియన్‌షిప్ పోటీలలో నెల్లూరు విద్యార్థులు పాల్గొన్నారు. గత నెల 29, 30 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో భారతదేశం నుంచి ఏడుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరంతా నెల్లూరుకు చెందిన వారు కావడం విశేషం. ఈ పోటీల్లో భారత్‌తో పాటు జపాన్, కొరియా, చైనా, ఫిలిప్పైన్స్, మంగోలియా, తైవాన్ దేశాలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో ఆర్యన్, జష్‌జైన్, ద్వీప్‌జైన్, తన్వి, దియాన్ష్, కెన్వి, ప్రాచీజైన్‌లు పాల్గొన్నారు. వీరంతా మెమోరి ఛాంపియన్‌షిప్ గ్రాండ్ మాస్టర్ రాజ్‌కుమార్‌జైన్ నేతృత్వంలో పాల్గొన్నారు.



# పేదల సొంతింటి కల నెరవేరుతుంది

## మంత్రి నారాయణ

ప్రభుత్వం విడుదల చేసిన జి.ఓ.నెం.388 వల్ల పేదవారి సొంతింటి కల నెరవేరుతుందని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి డా॥ పొంగూరు నారాయణ అన్నారు. గత నెల 29వ తేదీన నెల్లూరు కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన క్రమబద్ధీకరణ ఇంటి నివేశన స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 100 గజాలలోపు ఆక్షేపణ లేని ఆక్రమణ గృహాలను క్రమబద్ధీకరించి పట్టాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 7649మంది తమ ఆక్రమణలను క్రమబద్ధీకరించాలని దరఖాస్తు చేసుకోగా వారిలో 497మంది 100గజాలలోపు గృహాల్లో నివసిస్తున్నట్లు గుర్తించి వారికి పట్టాలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. సైనికులు తమకు ప్రభుత్వం ఇచ్చిన భూమి 10సంవత్సరాల తర్వాత అమ్ముకోవడానికి వెసులుబాటు కల్పించిందని, గతంలో చుక్కల భూమికి రిజిస్ట్రేషన్ లేదని, ఇప్పుడు వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ పాసు బుక్కులను ప్రవేశపెట్టామని, రిజిస్ట్రేషన్లు ఎక్కడి నుంచైనా చేసుకునే అవకాశం కల్పించినట్లు మంత్రి వివరించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మేయర్ అబ్దుల్ అజీజ్, జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు, జాయింట్ కలెక్టర్ వెట్రి సెల్వి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, చాట్ల నరసింహారావు, కొండ్రెడ్డి రంగారెడ్డి, తాళ్ళపాక అనూరాధ, ఆర్డీఓ డి.హరిత పాల్గొన్నారు.



# నడిచినా.. గెలిచినా... జనంతోనే!

## 366 రోజుల ప్రజాప్రస్థానం పాదయాత్రకు శ్రీకారం చుట్టిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి





ప్రజల మధ్యే నా జీవితం, ప్రజల కోసమే నా పోరాటం... ఇక నేను నడిచినా, గెలిచినా అంతా ప్రజల మధ్యే అంటూ 366రోజుల ప్రజాప్రస్థానం పాదయాత్రకు ఏప్రిల్ 29వ తేదీన నెల్లూరులోని రామలింగాపురం సెంటర్ నుండి శ్రీకారం చుట్టాడు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి.

రూరల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లు, గ్రామాల నుండి తరలి వచ్చిన ప్రజలు, వైసిపి కార్యకర్తల సమక్షంలో ఆయన పాదయాత్ర మొదలుపెట్టాడు. ఈ సందర్భంగా తెలుగుదేశం ప్రభుత్వ అవినీతిపై విమర్శలు ఎక్కుపెట్టారు. జగనన్న రాజ్యంతోనే రాజన్న రాజ్యం వస్తుందని చెప్పారు. ఈ నాలుగేళ్ళ తెలుగుదేశం పాలనపై ప్రజలు విసుగెత్తిపోయారని, వచ్చే ఎన్నికల్లో పేద, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల ప్రజల సంక్షేమానికి పాటుపడే వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

నెల్లూరు నగరంలో తాగే దానికి నీళ్ళు లేక కొనుక్కుని తాగాల్సి వస్తోందని, కలుషిత నీటితో జనాలు రోగాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గోడలమీద రాతలతో స్వచ్ఛ నెల్లూరు సాధ్యం కాదని, స్వచ్ఛమైన పాలన, స్వచ్ఛమైన వాతావరణం, స్వచ్ఛమైన నీళ్ళు అందిస్తే స్వచ్ఛ నెల్లూరు సాధ్యమవుతుందంటూ ఆయన ప్రభుత్వాన్ని ఏకారు.

# హోదా కోసం పొర్లు దండాలు

## - ఎంఎస్ఆర్ సేవాసమితి వినూత్న నిరసన

ప్రత్యేకహోదా ఉద్యమంలో తమవంతు బాధ్యతను నిర్వహిస్తున్న మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవాసమితి సోమవారం నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో వినూత్న ప్రదర్శన నిర్వహించింది. సమితి సభ్యులు గాంధీబొమ్మ సెంటర్‌లో నరేంద్ర మోదీ విగ్రహానికి పూలమాల వేసి పాలాభిషేకం నిర్వహించారు. మోదీ విగ్రహం చుట్టూ పొర్లు దండాలు పెంటారు. ప్రత్యేకహోదా ఇస్తే ఏపికి మోడీ దేవుడు... ఇవ్వకుంటే దెయ్యం అంటూ నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు కమతం అశోక్, సిహెచ్ మహేష్, డి.మహేష్, సాయికృష్ణ, నౌషద్ తదితరులు పాల్గొన్నారు.



నిర్యాణం 4 మే 1992

పితృదేవోభవ

సంఘసేవకులు, ప్రజాసేవకులు

స్వర్గీయ తిక్కవరపు బాబురెడ్డి గారు

26వ వర్ధంతి (04.05.18) సందర్భంగా

వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ..

కుమారుడు

డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి

రాజ్యసభ సభ్యులు, మాజీ కేంద్రమంత్రివర్యులు

# కల్యాణ వైభవం...!



తిరుపతి అమరరాజ బ్యాటరీస్ వైస్‌ప్రెసిడెంట్ గుడ్లూరు జగన్‌మోహన్ - నాగపద్మజల కుమారుడు సాయిప్రణీత్ - అక్షత (ఏలూరు పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తమ్మినేని ప్రకాష్‌నాయుడు - సుమల కుమార్తె)ల వివాహం ఏప్రిల్ 28వ తేదీన తిరుపతిలోని పిఎల్ఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

## చదువుతోనే ఉన్నత శిఖరాలు

### - దాత కనుమూరు హరిచంద్రారెడ్డి



విద్యార్థుల డైనింగ్ టేబుల్స్ రూంను ప్రారంభిస్తున్న హరిచంద్రారెడ్డి, డాక్టర్ సి.రోహిణి, ప్రభారెడ్డి తదితరులు

ప్రతి ఒక్కరు చదువుతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని, పట్టణం అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తామని కనుమూరు హరిచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కనుమూరు హరిచంద్రారెడ్డి అన్నారు. గూడూరు పట్టణంలోని బాలసదనం భోజనశాలలో కనుమూరు హరిచంద్రారెడ్డి దాతృత్వంతో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు భోజనం చేసేందుకు వీలుగా మరమ్మతులు చేసి బెంచీలను నిర్మించిన గదిని ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు ప్రభారెడ్డిలతో పాటు మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి సహాయ సహకారాలతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులందరూ బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని తెలియజేశారు. ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, ఇన్నర్‌వీల్ ప్రభారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు విష్ణువందన, జమున జీవని, పద్మ, కె.మునిగిరీష్, మునిరాజా, బాలకృష్ణంరాజు, రామకృష్ణ, జానకిరామిరెడ్డి, కె.సుందరరామిరెడ్డి, దశరథరామిరెడ్డి, బాలసదనం సూపరింటెండెంట్ కె.లక్ష్మి పాల్గొన్నారు.

## మల్లి మస్తాన్‌బాబు తల్లికి భూమి పత్రాలు



మల్లి సుబ్బమ్మకు భూమిపత్రాలందజేస్తున్న కలెక్టర్ ముత్యాలరాజు

అంతర్జాతీయ పర్వతారోహకుడు మల్లి మస్తాన్‌బాబు మాతృమూర్తి మల్లి సుబ్బమ్మకు రాష్ట్రప్రభుత్వం మంజూరుచేసిన రెండెకరాల భూమి పత్రాలను జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు అందజేశారు. గతనెల 29న కలెక్టర్ బంగ్లాలో ఆ మేరకు కలెక్టర్ ఆ పత్రాలను మల్లి సుబ్బమ్మకు అందజేశారు. ఇటీవల పడమటిపాళెంలో జరిగిన 'మీ భూమికి భరోసా' కార్యక్రమంలో తనకు అర్జీని సమర్పించారని, దానిని పరిశీలించి పెండింగ్‌లో ఉన్న ఆ భూమి విషయాన్ని పరిష్కరించామని తెలిపారు. సర్వే నెంబరు 1292లో 2 ఎకరాల భూమిని మంజూరు చేస్తూ ఆ పత్రాలను ఆమెకు అందజేశామని తెలిపారు.

## ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలి

జిల్లాలోని రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని రైతుసంఘాల సమాఖ్య నాయకుడు కోటిరెడ్డి జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజుకు విన్నవించారు. ఆ మేరకు ఆయన గత నెల 28న కలెక్టరేట్‌కు వెళ్ళి కలెక్టర్‌ను కలుసుకుని రైతన్నల సమస్యలు వివరించారు. ఆత్మకూరు, కలువాయి తదితర ప్రాంతాల్లో ప్రస్తుతం ధాన్యం దిగుబడులు బాగా ఉన్నాయని, బ్యాంక్ గ్యారంటీ లేని కారణంగా పిపిసిల్లో ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆయన వివరిస్తూ, రైతులను ఇబ్బందిపెట్టకుండా పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోళ్ళకు జిల్లా కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

### నెల్‌క్యాస్ట్ మరియు రోటరీ వెస్ట్ ఆధ్వర్యంలో

## ఉచిత వైద్య, రక్తదాన శిబిరం




ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న నెల్‌క్యాస్ట్ సిబ్బంది

గూడూరు నెల్‌క్యాస్ట్ కంపెనీలో ఇటీవల నెల్‌క్యాస్ట్ స్టాఫ్ వెల్‌ఫేర్ అసోసియేషన్ మరియు రోటరీ క్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య మరియు రక్తదాన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా నెల్‌క్యాస్ట్ సీనియర్ జీఎం ఆపరేషన్స్ ఎన్.ఎస్.రెడ్డి, నెల్‌క్యాస్ట్ జిఎం ఫైనాన్స్ మరియు ఎన్.ఎస్.డబ్ల్యూ.ఏ అధ్యక్షులు దువ్వూరు రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జరిగే హెల్త్ చెకప్‌లో కిమ్స్ హాస్పిటల్ నుంచి వైద్యులు వచ్చి 300 మంది నెల్‌క్యాస్ట్ సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారన్నారు. ఈ వైద్య శిబిరంలో బి.పి, షుగర్, ఇసిజి, డెంటల్, కంటి, జనరల్ చెకప్ పరీక్షలు నిర్వహించారన్నారు. పరీక్షల అనంతరం నెల్‌క్యాస్ట్ యాజమాన్యం ఉచితంగా మందులు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా నెల్‌క్యాస్ట్ సిబ్బంది 100మంది రక్తదానం చేశారు. డాక్టర్లు మంజీర, వెంకన్నబాబు, సి.రోహిణి, శ్రీనివాసచౌదరి, వినోద్‌కుమార్ తదితర డాక్టర్లు నెల్‌క్యాస్ట్ సిబ్బందికి వైద్యపరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు మోడిబోయిన సుబ్రహ్మణ్యం, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నాశిన నాగులు, వాసుగౌడ్, బొల్లినేని పిఆర్ఓ నవీన్ జయకుమార్, నెల్‌క్యాస్ట్ పిఆర్ఓ ఆనిమెళ్ళ శివకుమార్, నెల్‌క్యాస్ట్ జీఎంలు కె.సి.బ్రహ్మానందరెడ్డి, తాడేపల్లి మురళీకృష్ణ, డి.మునిచంద్రయ్య, టి.గజపతి, దామోదర్‌రెడ్డి, వి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# పదిలో గూడూరు విద్యార్థుల హవా

### శ్రీ వివేకానంద హైస్కూల్ ప్రభంజనం



2018 సంవత్సరం 10వ తరగతి పరీక్షా ఫలితాలలో గూడూరు శ్రీ వివేకానంద హైస్కూల్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ కె.చంద్రమోహన్ తెలిపారు. నలుగురు విద్యార్థులు 10జిపిఏ, 5మంది విద్యార్థులు 9.8 జిపిఏ సాధించారని మొత్తం 68మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 68మంది ఉత్తీర్ణులై వందశాతం ఫలితాలు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కె.వంశీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సత్తా చాటిన లిటిల్ ఏంజల్స్




ఎస్ఎస్‌సి-2018 ఫలితాలలో లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూల్ అద్భుత విజయాలను సొంతం చేసుకొని సత్తా చాటిందని, 74మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా అందులో నలుగురు విద్యార్థులు 10 జిపిఏ సాధించడం విశేషమని, 9జిపిఏ పైన 43 మంది విద్యార్థులు రావడం ఈ పాఠశాల సత్తాను తెలియజేసిందని, 74మంది విద్యార్థులు ఉత్తీర్ణులై నూరు శాతం ఫలితాలను సాధించామని ఎల్ఏపి స్కూల్ కరస్పాండెంట్లు బి.సుబ్రహ్మణ్యంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఫలితాలు తాము విద్యార్థుల పట్ల తీసుకునే ప్రత్యేకశ్రద్ధకు నిదర్శనమని, ఈ విజయానికి కారణమైన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

### వివిఎస్ఆర్ విద్యార్థుల విజయకేతనం



గూడూరు పట్టణంలోని వివిఎస్ఆర్ పాఠశాల విద్యార్థులు అత్యధిక పాయింట్లతో నూరుశాతం ఉత్తీర్ణులయ్యారు. జి.రాకేష్ 10కి 10 పాయింట్లు సాధించాడు. 7 మందికి 9.8 పాయింట్లు రాగా, 17మందికి 9.7 పాయింట్లు, మిగతా విద్యార్థులు 9కిపైగా పాయింట్లు సాధించారని వివిఎస్ఆర్ స్కూల్ కరస్పాండెంట్ ఎన్.అన్నపూర్ణ, డైరెక్టర్ ఎన్.బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.వి.ఎన్.రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

# సివిల్స్ విజేత రచన

## పనబాక ఇంట పుత్రికోత్సాహం



కుమార్తె రచనకు కేక్ తినిపిస్తున్న తల్లిదండ్రులు పనబాక కృష్ణయ్య, పనబాక లక్ష్మి, అక్క చేతన

మాజీ కేంద్రమంత్రి శ్రీమతి పనబాక లక్ష్మి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, రిటైర్డ్ ఐఆర్‌టిఎస్ అధికారి పనబాక కృష్ణయ్యల ముద్దుల తనయ పనబాక రచన సివిల్స్‌లో విజేతగా నిలిచింది. ఇటీవలే విడుదలైన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫలితాలలో ఆమె 929వ ర్యాంకు సాధించింది. అంతకుముందు కొద్దిరోజుల క్రితమే వెలువడ్డ ఏపిపిఎస్సీ ఫలితాల లోనూ ఆమె డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైంది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ట్రిబుల్ ఇ చేసిన రచన సివిల్స్ సర్వీసెస్‌ను సాధించడమే లక్ష్యంగా శ్రమించింది. తన విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు అక్క డాక్టర్ పనబాక చేతన, డాక్టర్ లక్ష్మయ్య స్టడీసర్కిల్ వారి సహకారం ఎంతగానో వుందని ఈ సందర్భంగా రచన తెలిపారు. ప్రజాసేవలో వున్న తన తల్లి దండ్రుల స్ఫూర్తితో సమాజానికి తనవంతు సేవలందిస్తానని రచన పేర్కొన్నారు. సివిల్స్‌లో ర్యాంకును సాధించి తల్లిదండ్రుల కలలను సాకారం చేసి, నెల్లూరు జిల్లా కీర్తిని ఇనుమడింపజేసిన రచనకు 'లాయర్' అభినందనలు.



# సైకిల్‌పై జోరుగా... హుషారుగా

## • పల్లెలను చుట్టేస్తున్న సోమిరెడ్డి

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సర్వేపల్లి నియోజకవర్గంలో జోరుగా సైకిల్‌యాత్ర నిర్వహిస్తున్నారు. దీనికోసం ప్రత్యేకంగా ఆయన ఓ సైకిల్ కూడా కొని, దానికి పసుపురంగు వేయించారు. ప్రస్తుతం పొదలకూరు మండలంలో ఆయన సైకిల్‌యాత్ర సాగుతోంది. యాత్రలో జలీల్‌ఖాన్‌లాగా కాకుండా ఆయనే ఉత్సాహంగా సైకిల్ తొక్కుతూ తోటి నాయకులకు, కార్యకర్తలకు కూడా హుషారు తెప్పిస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. మంత్రిగా సర్వేపల్లి నియోజకవర్గానికి, పొదలకూరు మండలంలో సాగునీటి పారుదల అభివృద్ధికి తాను చేపట్టిన చర్యలను వివరించారు. సైకిల్‌యాత్రలో సర్వేపల్లి ఇన్‌ఛార్జ్, చంద్రమోహన్‌రెడ్డి తనయుడు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా ఉత్సాహంగా పాల్గొంటున్నాడు.

# పేద ప్రతిభావంతులకు అభినందన



జేఇఇ మెయిన్స్ ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లోని విద్యార్థులను జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు అభినందించారు. ఈ నెల 1వ తేదీన ఆయన కలెక్టర్ బంగ్లాలో జేఇఇ మెయిన్స్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు కేకులు తినిపించారు. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలకు చెందిన 124 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా 51మంది ఉత్తీర్ణులై అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ సహకారంతో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం వల్ల మంచి ఫలితాలు వచ్చాయని కలెక్టర్ పేర్కొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# ఎంసెట్‌లో సత్తా చాటిన 'రత్నం' విద్యార్థులు

ఎంసెట్ ఫలితాల్లో నెల్లూరులోని రత్నం విద్యార్థులు తమ సత్తా చాటుకున్నారు. రాష్ట్రస్థాయి ర్యాంకులతో విజయకేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా రత్నం విద్యాసంస్థల ఛైర్మెన్ కెవి రత్నం మాట్లాడుతూ, తమ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. మెడికల్ విభాగంలో తమ విద్యార్థులు 192, 229, 323, 367, 372, 526, 804, 1121,1368, 1392, 1482, 1780, 1895, 1997 ర్యాంకులను సాధించారని ఆయన పేర్కొన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో 1007, 1671, 3552, 3911, 6215, 6740, 7467, 8850 ర్యాంకులను సాధించారని తెలిపారు. ఎంసెట్-2018లో 80 మంది విద్యార్థులు ఏజి బిఎస్సీ, బివిఎస్‌సిలో సీట్లు సాధించగలరని ఆయన ఈ సందర్భంగా తన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ జేఇఇ మెయిన్స్-2018లో తమ విద్యార్థులు 40 మంది ఎంపికయ్యారని ఆయన వివరించారు.

# తవ్విన రోడ్లను వెంటనే సరిచేయండి


## - నగర ఎమ్మెల్యే అనిల్



ప్రజాదీవెనలో అనిల్‌ను స్వాగతిస్తున్న దృశ్యం

నెల్లూరు నగరంలోని 14వ డివిజన్ ఏ.సి.నగర్‌లో ఈ నెల 3న జరిగిన ప్రజాదీవెన కార్యక్రమంలో భాగంగా నెల్లూరు నగర శాసనసభ్యులు డా॥ పి.అనిల్‌కుమార్‌యాదవ్ గడప గడపకు వెళ్ళి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకుని పార్టీ నవరత్నాల కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ నెల్లూరు నగరంలో భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టడంతో రోడ్లు తవ్వేసి తిరిగి సరిగా పూడ్చడం లేదని, అనేకమార్లు పబ్లిక్‌హెల్త్ అధికారులకు తెలిపినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నగరంలోని రోడ్లన్నీ తవ్వేసి ఎప్పుడో సరిచేస్తామని చెప్పడంతో దుమ్ము, ధూళితో దాదాపు లక్షల మంది ప్రజలు అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. దాదాపు ఏడాదిన్నర నుంచి తవ్విన రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్న ఆలోచన కూడా లేకపోవడం మంచి పద్ధతి కాదన్నారు. అధికార పార్టీ నాయకులు సైకిల్ యాత్ర చేపట్టారని, కనీసం సైకిల్‌పై వెళ్తున్నప్పుడన్నా రోడ్లు ఎలా వున్నాయి, ప్రజలు ఎంత ఇబ్బంది పడుతున్నారని ఆలోచించకపోవడం దారుణమన్నారు. మంత్రి నారాయణ దీనిపై దృష్టి సారించి ప్రజలు పడుతున్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో నాయకులు కర్తం ప్రతాప్‌రెడ్డి, లోకిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, కె.ప్రసాద్‌రెడ్డి, వి.ప్రసన్నరెడ్డి, బిజివేముల పిచ్చిరెడ్డి, గిరిధర్‌రెడ్డి, పి.సాకేష్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, ఓబులురెడ్డి, శివారెడ్డి, మీరాబాషా, చంద్రశేఖర్, ముదిరెడ్డి లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కల్యాణ వైభవం...!



కనిగిరి మాజీఎమ్మెల్యే స్వర్గీయ ఇరిగినేని తిరుపతినాయుడు మనుమడు, బిఎంఆర్ గ్రూప్ డైరెక్టర్ ఇరిగినేని రవీంద్రబాబు - రత్నకుమారిల కుమారుడు **అవినాష్ - శేషప్రియ** (పుదుచ్చేరికి చెందిన బి.ఆనందన్ - కమలమెల కుమార్తెల కల్యాణం ఏప్రిల్ 29వ తేదీ నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



తడ చెక్‌పోస్ట్ మోటార్ వాహనాల అధికారి ఎ.చంద్రశేఖర్‌రెడ్డి మేనల్లుడు, తిప్పవరప్పాడు వాస్తవ్యులు జక్కంరెడ్డి జానకిరామిరెడ్డి - సుజనల కుమారుడు **శశాంక్ కుమార్‌రెడ్డి - ఉజ్వల మీన**(గూడూరు మండలం చెన్నూరు వాస్తవ్యులు మందిపాటి సిద్ధారెడ్డి - రజినిల కుమార్తె)ల పెళ్ళి ఏప్రిల్ 27వ తేదీ గూడూరులోని దివ్య ఫంక్షన్‌హాల్ నందు జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభదీవెనలు.

# దేశ సంస్కృతిని ప్రతిబింబించిన చిన్నారుల నృత్యాలు

## - కళాంజలి నృత్యోత్సవంలో శివప్రభాత్‌రెడ్డి





కళాంజలి సత్కారాన్నందుకుంటున్న నృత్యదర్శకుడు పాల్

దేశ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా చిన్నారుల నృత్యాలు అలరించాయని, ప్రపంచ నృత్య దినోత్సవం సందర్భంగా కళాంజలి సంస్థ నిర్వహించిన ఇలాంటి కార్యక్రమాలు అందరిని ఆకట్టుకుంటాయని 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి పేర్కొన్నాడు. నెల్లూరు టౌన్‌హాలులో గత నెల 29న కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత ఆయన జ్యోతిప్రకాశనం చేసి కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడుతూ నెల్లూరు జిల్లా నుంచి నటులు, గాయకులు, నిర్మాతలు, దర్శకులు ఉన్నా నృత్యదర్శకులు లేరనే కొరత ఉండేదని, ప్రఖ్యాత నృత్య దర్శకురాలు తార, ప్రస్తుతం కళాంజలి సత్కారం అందుకున్న పాల్ జిల్లాకు చెందిన వారు కావడంతో ఆ కొరత కొంత తీరిందన్నారు. నాట్య గురువు సురభి గాయత్రి శిష్యురాళ్ళు జాతి సమైక్యతను చాటిచెప్పే విధంగా ప్రదర్శించిన గ్రూప్‌డాన్స్ అమోఘమని కొనియాడారు. ఈ సందర్భంగా సురభి గాయత్రిని అభినందించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న తుంగా శివప్రభాత్‌రెడ్డి, వైయస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మొయిళ్ళ గౌరిరెడ్డి, పాబోలు రామసుబ్బయ్య, యం.ప్రసన్నాంజనేయులు, ప్రపంచ తెలుగు సమాఖ్య జిల్లా రీజనల్ కమిటి ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు, సుంకు రామమోహన్‌రావుల చేతులమీదుగా ప్రముఖ సినీ నృత్య దర్శకులు పాల్‌ను కళాంజలి సంస్థ ఆధ్వర్యంలో శాలువాతో, గజమాల, కిరీటం, జ్ఞాపిక, సన్మానపత్రంతో "నృత్యరత్న" బిరుదుతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముందు వివిధ కళాసంస్థలు, చిన్నారులు చిన్ను, షారుక్, దుర్గ పూజిత ప్రదర్శించిన నృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నృత్య గురువులను కళాంజలి సంస్థ ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించారు. సినీ, శాస్త్రీయ నృత్య పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కళాంజలి సంస్థ వ్యవస్థాపకులు కళాంజలి అనంత్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా దువ్వూరు బెనర్జీ వ్యవహరించారు.



దశావతారాలను అత్యద్భుతంగా ప్రదర్శించిన చిన్నారులు

## అరుణమ్మ జయంతి సందర్భంగా...

# పెద్దాసుపత్రిలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి, ఎన్.బలరామయ్యనాయుడు

దాదాపు 10ఏళ్ల పాటు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సేవలందించి, నెల్లూరుజిల్లా కాంగ్రెస్ చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న స్వర్గీయ శ్రీమతి పందిళ్ళపల్లి అరుణమ్మ 65వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 2వ తేదీన నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అన్నదానం నిర్వహించారు. శ్రీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఆమె కుటుంబ సభ్యులు ఈ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆసుపత్రి ప్రాంగణంలోని శ్రీ సత్యసాయి నిత్యాన్నదాన హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దాదాపు 300మందికిపైగా రోగులు, వారి బంధువులు భోజనాలు చేసారు. పందిళ్ళపల్లి అరుణమ్మ భర్త పట్టాభిరామిరెడ్డి, కుమారుడు పందిళ్ళపల్లి హేమంత్‌రెడ్డి, కుమార్తె నిరూపలతో పాటు ఇలాంటి సేవా కార్యక్రమాలకు ముందుండే నలుబోలు బలరామయ్యనాయుడు, గడ్డం సుధాకర్‌రెడ్డి, ఎం.వి.రెడ్డి, హజరత్తయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉత్తమ రైతుకు సత్కారం



ఉత్తమరైతు అవార్డునందుకుంటున్న బాణా రమణారెడ్డి

వ్యవసాయాన్ని వృత్తిగా, బ్రతుకుతెరువుగానే కాకుండా తన బాధ్యతగా భావించి నేలను, నీళ్ళను నమ్ముకుని వరి దిగుబడిలో అద్భుత ఫలితాలు సాధించిన సంగం మండలం తరుణవాయి కండ్రిక (వెంకటేశ్వరపురం)కు చెందిన రైతు బాణా రమణారెడ్డిని ఈ నెల 2వ తేదీ ఉత్తమరైతు పురస్కారంతో ఘనంగా సత్కరించారు. రమణారెడ్డి రబీలో ఒక హెక్టార్‌లో ఎన్ఎల్ఆర్ 34449 (నెల్లూరు మసూరి) సాగుచేసి 11,276.50 కేజీల రికార్డు దిగుబడి సాధించారు. ఈ దిగుబడి సరికొత్త రికార్డు సృష్టించిందని వ్యవసాయ శాఖ జె.డి చంద్రనాయక్ రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ దృష్టికి తీసుకెళ్ళారు. అలాంటి ఫలితాలను సాధించిన రైతును అభినందించాలని బి.రాజశేఖర్ చేసిన సూచన మేరకు 2వ తేదీ కోవూరులోని వెటర్నరీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన 'గ్రామ స్వరాజ్ అభియాన్ కిసాన్ కళ్యాణ కార్యసాల' కార్యక్రమంలో కోవూరు శాసనసభ్యులు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రనాయక్, కోవూరు వ్యవసాయశాఖ ఏ.డి కుప్పయ్య, వెటర్నరీ డాక్టర్ అన్నపూర్ణ వ్యవసాయశాఖాధికారులు డి.నీరజా, కళ్యాణి, సురేంద్రరెడ్డి తదితరులు బాణా రమణారెడ్డిని ఉత్తమ రైతు పురస్కారంతో ఘనంగా సత్కరించారు.

# చంద్రబాబువన్నీ నాటకాలే!

## - నల్లపరెడ్డి ప్రసన్న విమర్శ



ప్రత్యేకహోదా విషయంలో చంద్రబాబు మొసలికన్నీరు కారుస్తున్నారని, చంద్రబాబువన్నీ నాటకాలేనని వైఎస్సార్‌కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు. ఈనెల 2న ఆయన మండలకేంద్రమైన కోటలో విలేకరులతో మాట్లాడుతూ, తమపార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధించడానికి గత నాలుగేళ్ళుగా రాజీలేని పోరాటం చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మోసపూరిత విధానాలను నిరసిస్తూ అయిదుగురు ఎంపీలతో రాజీనామాలు కూడా చేయించారన్నారు. అయితే, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం గత నాలుగేళ్ళుగా నాటకాలాడుతూ ప్రజలను మభ్యపెడుతూనే ఉన్నారని విమర్శించారు. తిరుపతి ధర్మపోరాట సభ ఒక నాటకమన్నారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే టిడిపి ఎంపిలతో రాజీనామాలు చేయించా లన్నారు. ఈ సమావేశంలో నాయకులు నల్లపరెడ్డి రాజేంద్రకుమార్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిల్లకూరు దశరధరామిరెడ్డి, శంకర్‌రెడ్డి, మండల కన్వీనర్ సంపత్‌కుమార్‌రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి మొబీన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం

# బద్వేలు కృష్ణారెడ్డి



నిర్మాణ రంగంలో సంచలనాలు సృష్టిస్తూ గత రెండున్నర దశాబ్దాల కాలంగా హైదరాబాదు నగరంలో విశేష గుర్తింపు పొందిన వంశీరామ్ బిల్డర్స్ సారధి బద్వేలు సుబ్బారెడ్డి పెదతండ్రి బద్వేలు కృష్ణారెడ్డి మే 1వ తేదీ కాలం చేశారు. ఆయన వయస్సు 81 సంవత్సరాలు. ఆయనకు భార్య యశోదమ్మ ఉన్నారు. వీరికి పిల్లలు లేరు. తన స్వంత అన్న తమ్ముళ్ళ పిల్లలనే తన సొంత పిల్లలుగా చూసుకున్నారు. ఇటీవలకాలంలో అనారోగ్యంతో బాధపడుతుండిన కృష్ణారెడ్డి మంగళవారం నాడు తుదిశ్వాస విడిచారు.

కృష్ణారెడ్డి స్వగ్రామమైన విడవలూరు మండలం పార్లపల్లిలో ఆయన అంతిమసంస్కారాలు నిర్వహించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# ఇంద్రుడికి మొగుడు

గల్పిక

అది ఇంద్ర లోకం రాజధాని అమరావతి. అప్పుడే తెల్లారింది. దేవేంద్రుడు లేచి కాలకృత్యాలు తీర్చుకుని స్నానం చేసి మేకప్ వేసుకుని తన ఆస్థానానికి చేరుకున్నాడు. సభా సభ్యులంతా లేచి గౌరవ మర్యాద లతో ఆయనను స్వాగతించారు. దేవేంద్రుడు సింహాసనాన్ని అధిష్టించి.. ఈరోజు నా మనసు ఎంతో ఉల్లాసంగా వున్నది... ఈ ఆనంద సమయంలో ఈ మనసు ఏదో వినోదము కోరుతున్నది అని చెబు తుండగా... సభలో నుండి 'ఇదే మీకు చివరి ఉల్లాసము' అనే వాయిస్ వినిపించింది. అది విని దేవేంద్రుడు ఎవరది... ఏమిటా పరిహాసము అని ఆవేశంగా అడిగాడు. అప్పుడు సభలో నుండి ఓ వ్యక్తి ముందు కొచ్చాడు. నీ పేరేంటని ఇంద్రుడు అడిగాడు. దానికతను... నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి అని చెప్పాడు. నాకు ఇదే చివరి ఉల్లాసదినము అని అంటివి... ఎందుకలా అన్నావు అని ఇంద్రుడు అడిగాడు. నేను ఆ మాట ఎందుకన్నానో మీకు చెబితే అర్ధం కాదు. మీరే అనుభవపూర్వ కంగా తెలుసుకుంటారు. ఇప్పుడే భూలోకం నుండి ఒక బుల్లెట్ ఈ లోకానికి దూసుకువచ్చింది. ఇక నీ పని 'జింతాక చిత చిత జింతాక తానే' అంటూ రెండు చేతులతో అక్కడే వున్న బల్ల మీద దరువేస్తూ చెప్పాడు నేదురుమల్లి. దానికి ఇంద్రుడు ఈ మానవుడు చెబుతున్నదేంటో నాకు అర్ధం కావడం లేదు. అయినా ఈ ఆనంద సమయంలో ఈ ఆటంకాలెందుకు... వెళ్ళి రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమలను తీసుకురండి.. వారి నాట్య విన్యాసాలను చూసి మైమరచిపోదామని అన్నాడు. అందుకు అక్కడే ఉన్న ఇంద్రుడి పి.ఏ నాగసేనుడు... ఇంకెక్కడి రంభ, మేనకలు రాజా... భూలోకం నుండి ఎవరో కొత్త మానవుడు వచ్చాడు. మనిషి చాలా వెరైటీగా వున్నాడు ప్రభు. మన లోకానికి వచ్చిన మానవులెవరూ అతనిలా లేరు. మేనక, రంభ, ఊర్వశి, తిలోత్తమలు అతని చుట్టూ చేరారు. అతన్ని వదిలి రావడం లేదు అని చెప్పాడు. ఆ మాటకు దేవేంద్రు డికి అరికాల్లో మండింది. ఆ మానవుడు నాకంటే అందగాడా... నాకంటే శృంగారధీరుడా... ఎవరతను... అతని సంగతేంటో చూద్దాం పదండి అంటూ లేచాడు.

అమరావతిలోని కల్చరల్ ప్రోగ్రామ్స్ హాల్. ప్రేక్షకులతో నిండిపోయి వుంది. దేవేంద్రుడు తన భటులతో కలిసి హాల్‌లోకి అడుగుపెట్టాడు. అప్పుడే డిటిఎస్ మ్యూజిక్ మొదలైంది. స్టేజీ మీద ధగధగ లైట్లు వెలుగుతుండగా రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమలు నలుగురూ నాలుగు వైపుల వున్నారు. వారి మధ్యలో కళ్ళకు నల్లద్దాలు, నల్ల టీషర్ట్, నల్లఫ్యాంట్, నల్లబూట్లు వేసుకుని మెగాస్టార్ చిరంజీవిలా ఓ వ్యక్తి వున్నాడు. అతన్ని చూసి దేవేంద్రుడు పి.ఏ నాగసేనుడితో... అతని పేరేమిటి అని అడిగాడు. నేను చెప్పిన వెరైటీ మానవుడు ఇతనే ప్రభూ..! పేరు 'స్టైల్ ఆఫ్ సింహపురి' ఆనం వివేకానందరెడ్డి అట. నెల్లూరు నుండి వచ్చాడు అని పి.ఏ చెప్పాడు. ఇంత చిన్నవయసులోనే మన లోకానికి వచ్చాడు. నిండా పాతికేళ్ళు కూడా లేనట్లున్నాయి. రంభ, ఊర్వశిల మీద మనసుపడి వచ్చాడా అని దేవేంద్రుడు అడిగాడు. ఆయనకు పాతికేళ్ళేంటి ప్రభూ, 67ఏళ్ళు. అతను భూలోకంలో పేరుమోసిన రాజకీయ నాయకుడు. యోధానుయోధులనే మట్టి కరిపించాడు. ఆయన ఇక్కడకు వచ్చాడంటే... నాకేదో మీకు మూడిందనిపిస్తుందని అను మానం వ్యక్తం చేశాడు. అందుకు దేవేంద్రుడు... ఇలాంటి పిల్ల కాకులు నన్నేం చేస్తాయి. ఈ ఇంద్రుడిని పెద్ద పెద్ద రాక్షసులే ఏమీ చేయలేకపోయారని పగలబడి నవ్వుతూ అన్నాడు.

అంతలో స్టేజీ మీద నుండి పాట రాసాగింది. యముడికి మొగుడు సినిమాలో "నో నో నో నో నో... నోనోనో.. నాట్యమిదా... నోనోనో... గానమిదా..." అనే పాటకు వివేకా నలుగురి నడుములు తిప్పుతూ చిరంజీవి లెవల్లో స్టెప్పులేసాడు. తర్వాత గమ్ గమ్ స్టార్ డ్యాన్స్, ఆ తర్వాత లుంగీ డాన్స్, చివరగా రంగమ్మ మంగమ్మ పాటకు డ్యాన్స్ ఇరగదీసాడు. వివేకా డ్యాన్స్‌తో హాల్ చప్పట్లు, ఈలలతో మోతెక్కింది. వివేకా స్టేజీ దిగగానే రంభ, ఊర్వశిలతో పాటూ అక్కడున్న అమ్మాయిలందరూ వివేకా ఆటోగ్రాఫ్‌ల కోసం ఎగబడ్డారు. వివేకా ఓపిగ్గా అందరికీ ఆటోగ్రాఫ్‌లిస్తూ... ప్రేమగా పలుకరించసాగాడు. అప్పుడు అక్కడున్న జనంలో నుండి ఒకడు 'మిర్చి' సినిమాలో 'పండుగలా దిగివచ్చావు... ప్రాణానికి వెలుగి చ్చావు' అనే పాట పెట్టాడు. ఆ పాటకు వివేకా చుట్టూ జనం మూగిపోయి... వివేకన్నా జిందాబాద్ అంటూ జేజేలు పలక సాగారు. ఆ సీన్‌లన్నీ చూసేసరికి దేవేంద్రుడికి కడుపు గ్యాస్‌తో మండిపోయింది. తట్టుకోలేక రంభ, ఊర్వశి, మేనకలను పిలిచి... నా ఆస్థానం నుండి మిమ్మల్ని ఎవరు ఇక్కడకు రమ్మన్నారు... ఈ తుచ్ఛమానవులతో మీరు కలిసి నృత్యం చేయడమేంటి... ఇది స్వర్గం అనుకుంటున్నారా, నరకం అనుకుంటున్నారా... అంటూ వారిపై కోపంతో చిందులు తొక్కసాగాడు. అప్పుడు వివేకా... ఇంద్రా ఆగు... అంతకుమించి వారి గురించి ఒక్క మాట మాట్లాడినా బాగుండదు. అసలు స్త్రీ అంటే ఎవరనుకున్నావు. మన బట్టలను ఇస్త్రీ చేసే దేవత... స్త్రీ అంటే ఎవరనుకున్నావ్... మన ఇంటికి మురామేస్త్రి.. స్త్రీ లేనిదే జననం లేదు... స్త్రీ లేనిదే మరణం లేదు... స్త్రీ లేనిదే... మన ఒంటిమీద అట్లకాడ వాతలు లేవు... స్త్రీ గొప్పతనం గురించి ఓ జపాన్ కవి ఏమన్నాడో తెలుసా...? అని ఆవేశంగా అడిగాడు. ఏమన్నాడు అని దేవేంద్రుడు ఆసక్తిగా ప్రశ్నించాడు. 'నేడీ దయసోరా ఒకసో సమోసా హిటూచి నిప్పో ఒనిడా మాకి హిటో సంసంగో' అని వివేకా చెప్పాడు. ఆ మాటలు అర్ధంకాక దేవేంద్రుడు బుర్రగోక్కోసాగాడు. స్త్రీ గొప్పతనం గురించి వివేకా అంత బాగా చెప్పడం చూసి అక్కడున్న మహిళలు, స్వర్గలోకపు నృత్య కళాకారిణు లందరూ వివేకా ఫ్యాన్స్ అయిపోయారు. అప్పటికప్పుడు వివేకా అభిమాన సంఘం ఏర్పాటు చేయడమేకాక, ఇంద్రుడు డౌన్ డౌన్... వివేకా జిందాబాద్... స్వర్గలోకపు అధిపతిగా వివేకాను నియమించాలని నినాదాలు చేయసాగారు. అంతలో అక్కడకు నంది వాహనంపై శివుడు ప్రత్యక్షమయ్యాడు. దేవదేవా... మీ ఆకస్మిక పర్యటనకు కారణమేమి అని ఇంద్రుడు అడిగాడు. శివయ్య సెల్‌ఫోన్‌లో వాట్సప్ ఓపెన్ చేసి ఒక పిక్చర్ ఆన్ చేసాడు. కొన్ని నిముషాల ముందే రంభ, ఊర్వశి, మేనకలను ఇంద్రుడు దూషించిన సన్నివేశాలు వస్తున్నాయి. అది చూసి దేవేంద్రుడు ఆశ్చర్యపోయాడు. స్వామి, ఇక్కడ జరిగింది మీకు ఎలా వచ్చింది అని అడిగాడు. దానికి శివయ్య... వివేకాను చూపిస్తూ... ఈ మానవుడే నువ్వు తిట్టేటప్పుడు సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి నాకు పంపించాడు. ఈ సన్నివేశాలు మానవ హక్కుల సంఘాలు, మహిళా సంఘాలు, మీడియా కంటపడితే మన దేవలోకం పరువు ఏం కావాలి... ఇది ఫస్ట్ వార్నింగ్, ఇక నుండి జాగ్రత్తగా వుండు... ముఖ్యంగా ఈ వివేకా ఇక్కడున్నంత కాలం నీ చుట్టూ సి.సి.కెమెరాలున్నట్లే... అని చెప్పి మాయమయ్యాడు. అప్పుడు అక్కడే వున్న నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి దేవేంద్రుడితో... నేను చెప్పానా, నీకు ఉల్లాసంగా అనిపించే చివరిరోజు ఇదేనని అని వెటకారంగా అన్నాడు.

***హాస్యానికి నిలువెత్తు చిరునామా, వ్యంగ్యానికి వ్రాసిపెట్టిన వీలునామా 'స్టైల్ ఆఫ్ సింహపురి' ఆనం వివేకాకు ఈ 'గల్పిక' అంకితం.***

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

దైవ సేవ కార్యాలలో పాల్గొంటారు. శరీరానికి గాయాలు తగలకుండా జాగ్రత్తపడాలి. ఉద్యోగులకు కార్యసామర్ధ్యంతో పాటు, పని భారం అదనంగా ఉంటుంది. ప్రయాణాలుంటాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. విద్యావృద్ధి కలదు. వృత్తి వ్యాపారాలలో ప్రోత్సాహం బాగుండి ఆదాయం పెరుగుతుంది. త్రోసి పుచ్చలేని అదనపు ఖర్చులు కూడా ఉంటాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఉద్యోగులు అధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్త పడండి. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. కొన్ని ముఖ్య నిర్ణయాలు తీసికొనలేని పరిస్థితులుండవచ్చును. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. అనవసర విషయాల జోలికి పోవద్దు. విద్యార్థులు మరింత కష్టపడాలి. ఆర్థిక సమస్యలతో పాటు బయట వ్యవహార వత్తిడి ఆందోళన కలిగిస్తుంది. ప్రయాణాల వల్ల శ్రమ ఉంటుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

సభలు సమావేశాలలో పాల్గొంటారు. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేసుకొనాలి. ఆరోగ్యం ఫరవా లేదు. అధికారులకు స్థానమార్పు, ఉద్యోగులకు ఇతర బాధ్యతలు రావడం జరుగుతుంది. విద్యా ప్రగతి బాగుంటుంది. ఉద్యోగార్థులకు కొంత మేలు జరుగుతుంది. ఇంట్లో వారితో భేదాభిప్రాయాలు రాకుండా చూచుకొనాలి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడవచ్చును.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

అధికారులకు పెరిగిన బాధ్యతల వల్ల శ్రమ, ఉద్యోగులకు కార్యసామర్ధ్యం బాగుంటుంది. మీకు సంబంధం లేని విషయాలలో తలదూర్చవద్దు. వైద్య సాంకేతిక రంగాల వారికి గౌరవ గుర్తింపులుంటాయి. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతాయి. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగి ఆదాయం పెరుగుతుంది. వస్తు, వాహన రిపేర్ల ఖర్చులుంటాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

పరిచయాలు, వ్యాపకాలు పెరుగుతాయి. అధికారులకు పెరిగిన బాధ్యతల వల్ల శ్రమ, ఉద్యోగులకు కార్యసామర్ధ్యం బాగుంటుంది. మీకు సంబంధంలేని విషయాలలో తలదూర్చవద్దు. వైద్య సాంకేతిక రంగాల వారికి గౌరవ గుర్తింపులుంటాయి. ధర్మ, దైవ కార్యాలకు సహాయమందిస్తారు. ఆరోగ్యం బాగుంటుంది. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

టెండర్లు, ఏజన్సీలు లభించే అవకాశమున్నది. ఉపాధి, మార్కెటింగ్ రంగాల వారికి అభివృద్ధి బాగుంటుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. పెళ్ళి ప్రయత్నాలు చేసేవారికి అనుకూల కాలం. కొత్త పరిచయాలు, వ్యాపకాలు పెరుగుతాయి. ఉద్యోగులకు పని భారం ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు పెరిగి ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

**తేది. 4.5.2018 నుండి**
**తేది. 10.5.2018 వరకు**

ఈ వారం మీనంలో బుధుడు, 9తేది నుండి మేష బుధుడు, మేషంలో రవి, వృషభంలో శుక్రుడు, కర్కాటకంలో రాహువు, తులలో గురువు, ధనుస్సులో శని, మకరంలో కేతు కుజులు, ధనుర్మకర కుంభ రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము :**

తేది 4 శుక్రవారము నుండి డొల్లు కర్తరి ప్రారంభము.

**ముహూర్తములు**

తేది 6 ఆదివారము రాత్రి 6.50 నుండి 9.0 గంటలలోగా వృశ్చిక లగ్నమున వివాహము. తేది 9 బుధవారం రాత్రి గంట 6.40 నుండి 8.50లోగా గృహ ప్రవేశ వివాహములకు వృశ్చికలగ్నము.

### వైశాఖ మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 4 | శుక్ర | చతుర్ధి | ఉ॥ గం.9.34వ॥ |
| తేది. 5 | శని | పంచమి | ఉ॥ గం.11.26వ॥ |
| తేది. 6 | ఆది | షష్ఠి | ప॥ గం.1.30వ॥ |
| తేది. 7 | సోమ | సప్తమి | సా॥ గం.3.31వ॥ |
| తేది. 8 | మంగళ | అష్టమి | సా॥ గం.5.19వ॥ |
| తేది. 9 | బుధ | నవమి | రా॥ గం.6.50వ॥ |
| తేది. 10 | గురు | దశమి | రా॥ గం.7.51వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

సమస్యలు పెండింగ్‌లోనున్నవి పరిష్కారం కాగలవు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. అనుకోని ధన, వస్తు లాభం ఉండవచ్చును. బంధు మిత్రులతో ఉత్సాహంగా గడుపుతారు. విలువైన వస్తువులు సమకూర్చుకొంటారు. విద్యాప్రగతి బాగుంటుంది. మంచి ఆర్థికావకాశాలు, ఉద్యోగావకాశాలు కలిసి వస్తాయి. ఆదాయం తృప్తికరము.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వాహనాలు నడిపేవారు యంత్రాలతో పనులు చేసేవారు జాగ్రత్తగా మెలగాలి. చిన్నచిన్న పొరపాట్ల వల్ల మాటలు పడవలసిరావచ్చును. శుభకార్య ప్రయత్నాలు ఫలించకపోవచ్చును. విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలి. సభలు, సేవా కార్యాలలో పాల్గొంటారు. ఆదాయ వ్యయాలు సరిపోతుంటాయి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

బంధువర్గంతో ఏదో ఒక రూపంలో విభేదాలు రావచ్చును. విద్యా కృషి బాగుంటుంది. గృహ వస్తు వాహన రిపేర్లపైన, ఆరోగ్యానికై ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి. అనుకోని ప్రయాణాలుంటాయి. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత ఉంది. కోర్టు కేసులు వాయిదా పడతాయి. ఉద్యోగుల సమర్ధతకు సరైన గుర్తింపు లభించదు. విద్యా ప్రగతి బాగుంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

పెట్టుబడులు, కొత్త వ్యాపారాలు ప్రస్తుతానికి విరమించండి. ఉద్యోగుల విధి నిర్వహణ సాఫీగా సాగుతుంది. అనుకోని ప్రయాణాలు బంధుమిత్రులను కలుసుకొనడం జరుగుతుంది. ఆరోగ్యం ఫరవాలేదు. విద్యా ప్రగతి బాగుంటుంది. ఆదాయ వ్యయాలు సరిపోతుంటాయి. కొన్ని అనవసర ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి. వ్యవహారాలు, పనుల వల్ల తీరిక ఉండదు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ప్రభుత్వ పర్మిషన్లు, బ్యాంకులోన్లు పొందుతారు. అనవసర విషయాలలో జోక్యం చేసికొనవద్దు. పెట్టుబడులకు అనుకూలం. ఉద్యోగులకు పనిభారం పెరిగినా అధికారుల ఆదరణ బాగుంటుంది. విద్యార్థుల కృషి బాగుంటుంది. కుటుంబ సౌఖ్యం కలదు. ఆర్థికంగా బలపడతారు. వృత్తి వ్యాపారాలు బాగుండి, ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులు నెరవేరుతాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

బంధుమిత్రులను కలుసుకొంటారు. కుటుంబ సౌఖ్యం బాగున్నది. వివాహ, ఉద్యోగ ప్రయత్నాలకు ఇతరుల సహకారం ఉంటుంది. విద్యా ప్రగతి బాగుంది. ఆరోగ్యం కూడా బాగుంటుంది. పెట్టుబడులకు పొదుపు పథకాలకు ప్రయత్నాలు చేస్తారు. ఆదాయానికి లోపం రాదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. మీ ఆలోచనలు, ప్రయత్నాలు ఫలించగలవు.

# పది ఫలితాలొచ్చాయి

## చివరి స్థానంలో నెల్లూరుజిల్లా

***విద్యా రంగంలో నెల్లూరుజిల్లాకు ఎంతో పేరుంది. ప్రైవేట్ విద్యకు పునాది ఇక్కడే! కార్పొరేట్ చదువులు ఆరంభమైంది ఇక్కడే! ఎంసెట్ ర్యాంకులు కొల్లగొట్టింది ఈ జిల్లానే! రత్నం, నారాయణ, కోరా వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు ఉద్భవించింది ఇక్కడే! చదువులకు పేరుమోసిన అలాంటి జిల్లా ఈసారి పదో తరగతి పరీక్షా ఫలితాలలో బాగా వెనుకబడిపోయింది. రాష్ట్రంలో 13జిల్లాలే వుంటే ఉత్తీర్ణతా శాతంలో ఆ 13వ చివరి స్థానమే మనకు దక్కింది. గత ఏడాది 4వ స్థానం పొందిన జిల్లా ఈసారి అట్టడుక్కిపోయింది. 80.37 శాతం ఫలితాలతో నెల్లూరు జిల్లా 13వ స్థానంలో నిలిచింది. జిల్లాలో మొత్తం 32,854 మంది పరీక్షలు వ్రాయగా 26,404 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 16,964 మంది బాలురు, 12,834 మంది బాలికలు ఉన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కలిపి 1001 మంది 10కి 10 జిపిఏ సాధించారు.***

### ఎస్ఆర్కె

పదవ తరగతి ఫలితాల్లో నెల్లూరులోని ఎస్ఆర్కె స్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని పాఠశాల కరస్పాండెంట్ కృష్ణమూర్తి, డైరెక్టర్ దిలీప్కుమార్ తెలిపారు. నెల్లూరులోని ఎస్ఆర్కె పాఠశాలలో గత నెల 29న 10కి పది జిపిఏ సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ తమ పాఠశాల నుంచి 9మంది విద్యార్థులు 10/10, 8మంది విద్యార్థులు 9.8 జిపిఏ సాధించారన్నారు.

### రత్నం

పదవ తరగతి ఫలితాల్లో రత్నం విద్యార్థులు జయకేతనం ఎగురవేశారని రత్నం పాఠశాల డైరెక్టర్ వేణుగోపాల్ తెలిపారు. నెల్లూరు హరనాథపురంలోని రత్నం మెడికల్ అకాడమీలో గత నెల 29న 10/10 జిపిఏ సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా తమ సంస్థ నుంచి పదవ తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థుల్లో 53 మంది 10/10, 275మంది 9.8, 394 మంది 9.7, 491 మంది 9.5, 588 మంది 9.3, 678 మంది 9.2, 768 మంది 9.0 జిపిఏ సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

### వేదవ్యాస

టెన్త్ పరీక్షల్లో నెల్లూరు మాగుంట లే-అవుట్లో ఉన్న వేదవ్యాస స్కూలు విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఈ స్కూలుకు చెందిన జి.మౌనిష, కె.మిస్బా, బి.రేణుశ్రీలు 10కి 10 జిపిఏ సాధించారని, అంతేకాక ఈ స్కూలు నుంచి మొత్తం 45 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, రికార్డుస్థాయిలో 42మంది విద్యార్థులు ఏ-గ్రేడ్ సాధించారని స్కూల్ కరెస్పాండెంట్ ఏపి బాలాజీ సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా వీరిలో నలుగురు 9.8జిపిఏ సాధించారని, 11 మంది 9.7, అయిదుగురు 9.5జిపిఏ సాధించారని, మరో 32 మంది విద్యార్థులు 9 పాయింట్లకు పైగానే సాధించారని ఆయన తెలిపారు. విద్యార్థులందరినీ ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

### మైథిలి

నెల్లూరు వేదాయపాలెం మైథిలి స్కూల్ విద్యార్థులు 2018 మార్చిలో జరిగిన పదవ తరగతి పరీక్షల్లో 39మంది విద్యార్థులు ఉత్తీర్ణులై వంద శాతం ఫలితాలను సాధించడంతో పాటు 5 మంది విద్యార్థులు 10/10 జిపిఏ సాధించారు. సిహెచ్.దామిని, జి.దేవి శ్రియ, పి.హేమ, సి.హెచ్.మౌనిక, జి.నందిని 10/10 జిపిఏ సాధించారు. 9.8/10 జిపిఏను నలుగురు విద్యార్థులు సాధించారు. 39మంది విద్యార్థుల్లో 30మందికి పైగా 9పైగా జిపిఏ సాధించి ఆధిక్యత ప్రదర్శించారు. ప్రతి సబ్జెక్ట్లో 10/10 గ్రేడ్ పాయింట్లు అత్యధికంగా సాధించారు. తెలుగులో 13, హిందీలో 15, ఇంగ్లీషులో 28, గణితంలో 10, సైన్స్లో 12, సోషల్లో 24మంది 10/10 గ్రేడ్ పాయింట్లు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మనోహర్రెడ్డి, కరస్పాండెంట్ మైథిలీ విద్యార్థులను రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచినందుకు ప్రత్యేకంగా అభినందించారు. ఈ విజయానికి కారకులైన ఉపాధ్యాయులను తల్లిదండ్రులను అభినందించారు.

### మోడరన్

ఈ ఏడాది పదో తరగతి ఫలితాలలో నెల్లూరు సరస్వతీనగర్లోని మోడరన్ స్కూల్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. 15మంది విద్యార్థులు 10, 9.8, 9.7జిపిఏ సాధించగా, 27మంది విద్యార్థులు 9కిపైగా జి.పి.ఏ సాధించారు. విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్రెడ్డి అభినందించారు.

### ఎల్ఎల్ఎఫ్

నెల్లూరు వేదాయపాలెంలోని లిల్లీ లిటిల్ ఫ్లవర్ స్కూల్లో 6మంది విద్యార్థులు 10కి 10 జిపిఏ సాధించగా 33మంది 9కిపైగా జిపిఏ సాధించారు. 62మంది విద్యార్థులు ఏ గ్రేడ్ సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ ఇ.కృష్ణచైతన్య ఒక ప్రకటనలో అభినందించారు.

### శ్రీ సాయినాథ్

నెల్లూరు నగరంలోని శ్రీ సాయినాథ్ ఇంగ్లీష మీడియం స్కూలు 2018 పదవ తరగతి ఫలితాలలో తన విజయ పరంపరను కొనసాగించింది. పరీక్షకు హాజరైన 42మంది విద్యార్థులకుగాను జిపిఏ 10/10 ఇద్దరు, జిపిఏ 9కిపైగా 16మంది సాధించి తమ సత్తాను చాటుకున్నారు. ఈ విజయానికి కారకులైన విద్యార్థినీ విద్యార్థులకు స్కూల్ కరస్పాండెంట్ పి.కుసుమ అభినందించారు.

# ఈ ఫలితాలు దారుణం

## మున్సిపల్ స్కూళ్ళలో పది ఉత్తీర్ణతా శాతంపై ముక్కాల, రూప్కుమార్ల ఆవేదన



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్

ఇటీవల వెల్లడైన టెన్త్ ఫలితాల్లో మున్సిపల్ పాఠశాలల విద్యార్థుల ఉత్తీర్ణతశాతం తక్కువగా ఉండడం బాధాకరమని డిప్యూటీమేయర్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేషన్ ఫ్లోర్లీడర్ పి.రూప్ కుమార్యాదవ్లు ఆవేదన వ్యక్తం చేశారు.

నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో గతనెల 29న వారు విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. మున్సిపల్ పాఠశాల్లో ఉత్తమ ఫలితాలకై అందరం కృషిచేయాలన్నారు. నగరంలో మున్సిపల్ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేశారని, అందులో 49 మంది విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడం సంతోషకరమని, అయితే మునిసిపల్ పాఠశాలల్లో 1050 మందికి పైగా విద్యార్థులున్నారని, విద్యలో వారి స్థితిగతుల గురించి కార్పొరేషన్ పర్యవేక్షణ లోపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేషన్ పరిధిలోని ప్రతిడివిజన్లో ఆయా కార్పొరేటర్లు మున్సిపల్ పాఠశాలల బాధ్యతను తీసుకోవాలని, పార్టీలకు అతీతంగా అందరం కలిసికట్టుగా కృషిచేసి విద్యార్థులకు మంచి ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు. మున్సిపల్ పాఠశాలల్లోని విద్యార్థులు 12 వందల మంది పరీక్షలు రాస్తే కేవలం నలుగురు మాత్రమే 10కి 10 జిపిఏ సాధించారన్నారు. కేవలం 78 శాతం మాత్రమే ఫలితాలు వచ్చాయన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు లేబూరు పరమేశ్వరరెడ్డి, ఓబిలి రవిచంద్ర, గోగుల నాగరాజు, ఎం.డి ఖలీల్ అహ్మద్, నాయకులు వందవాశి రంగా పాల్గొన్నారు.

# జెఈఈ మెయిన్స్లో విశ్వసాయి విజయం




జెఈఈ మెయిన్స్లో నెల్లూరులోని విశ్వసాయి జూనియర్ కళాశాలకి చెందిన 39మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో ఎన్నికయ్యారు. విద్యార్థుల నిరంతర కృషి, అధ్యాపకుల పర్యవేక్షణ ఈ విజయాలకు కారణమని విశ్వసాయి విద్యా సంస్థల ఛైర్మెన్ డా॥ యన్.సత్యనారాయణ తెలిపారు. ఈ విజయాలను సాధించిన విద్యార్థులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. మేము రూపొందించి అవలంబిస్తున్న స్ట్రెస్ ఫ్రీ ఎడ్యుకేషన్, 5 స్టెప్ ప్రోగ్రామ్ ద్వారా ఎంపిసిలో కూడా మంచి ఫలితాలు సాధిస్తున్నామని విశ్వసాయి విద్యాసంస్థల వైస్ఛైర్మెన్ కృష్ణమోహన్ తెలిపారు. ఈ ఫలితాల స్ఫూర్తితో ప్రత్యేకంగా రూపొందించిన విశ్వసాయి ఐఐటి అకాడమీకి విద్యార్థుల నుంచి మంచిస్పందన ఉందని తెలిపారు. మే20వ తేదీ జరగబోయే జెఈఈ అడ్వాన్స్డ్లో కూడా అసమాన్య ప్రతిభ కనబరుస్తారని, దానికి తగిన ప్రోత్సాహం అధ్యాపకుల నుంచి, తల్లిదండ్రుల నుంచి ఉంటుందని తెలుపుతూ, ఈ విజయపరంపర భవిష్యత్తులో అన్ని పోటీపరీక్షలలో కూడా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# అప్రమత్తతతో ఆస్మా నియంత్రణ

**- డాక్టర్ గౌరీనాథ్**





ఆస్మా వ్యాధిని అదుపులో పెట్టుకోకుంటే ప్రమాదమని నెల్లూరు అపోలో స్పెషాలిటీ ఆసుపత్రి పల్మనాలజిస్ట్ డాక్టర్ గౌరీనాథ్ చెబుతున్నారు. ప్రతి ఏడాది మే నెలలో వచ్చే మొదటి మంగళవారాన్ని ప్రపంచ ఆస్మా దినోత్సవంగా నిర్వహిస్తున్నారని ఆయన చెబుతూ దేశంలో ఇటీవల కాలంలో ఆస్మా వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగించే విషయమన్నారు. 10ఏళ్ల లోపు వయసు కలిగిన వారిలో 50శాతం మంది ఆస్మా వ్యాధితో బాధపడుతున్నట్లు వెల్లడించారు. ఈ వయస్సులో ఆస్మా వచ్చిన వారికి యుక్తవయసు వచ్చేసరికి క్రమంగా తగ్గుతుందని ఆయన చెప్పారు. పెద్దల్లో వచ్చే ఆస్మా వ్యాధిని మాత్రం సరైన చికిత్స ద్వారానే నియంత్రించగలమని ఆయన పేర్కొన్నారు. మన దేశంలో సరైన సమయంలో ఆస్మా వ్యాధిని గుర్తించక పోతుండడం వల్ల చికిత్స అందించడంలో ఆలస్యమవుతోందన్నారు. ఆస్మా వ్యాధి వంశ పారంపర్యంగా వచ్చేదని, ఇటీవల కాలంలో కాలుష్యం, దోమల వల్ల కూడా వ్యాపిస్తోందన్నారు. దగ్గు ఆయాసం, ఛాతి పట్టేసినట్లుండడం, శ్వాస తీసుకునే సమయంలో పిల్లికూతలు రావడం ఈ వ్యాధి లక్షణాలని, వర్షాకాలం, చలికాలంలో ఈ వ్యాధి ఎక్కువగా కనిపిస్తుందని చెప్పారు. చిన్నపిల్లల్లో ఆస్మా వ్యాధిని గుర్తించడం కష్టమని, అయితే 6ఏళ్ళు నిండిన వారికి స్పైరోమెటలిన్ అనే పరీక్ష ద్వారా ఈ వ్యాధిని గుర్తించవచ్చని, అపోలో ఆసుపత్రిలో ఈ పరీక్ష అందుబాటులో ఉందని చెప్పారు. ఇన్హేలర్స్ వంటి వాటితో ఆస్మా వ్యాధిని నియంత్రించవచ్చని ఆయన పేర్కొన్నారు. అయితే వైద్యుల సలహాలతోనే ఈ వ్యాధి నివారణకు తగ్గ మందులు, ఇన్హేలర్స్ వాడాలని ఆయన సూచించారు.

# జెఎంకె ఫుట్బాల్ సమ్మర్ కోచింగ్



వైయస్సార్ కాంగ్రెస్పార్టీ ఆధ్వర్యంలో జెఎంకె ఫుట్బాల్ క్లబ్ నిర్వహణలో నెల్లూరు నగర శాసన సభ్యులు డా॥ పి.అనిల్కుమార్ యాదవ్ నాయకత్వంలో మే 1 నుంచి 20 వరకు సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో జరిగే సమ్మర్ ఫుట్బాల్ కోచింగ్ను ఫాదర్ ఆనంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫాదర్ ఆనంద్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని, దీంతో ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉంటారన్నారు. విద్యార్థులు క్రీడలపట్ల ఆసక్తి చూపించాలని, అలాగే నైపుణ్యత కనబరచాలని కోరుకుంటున్నానన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా జీవించి, జ్ఞానాన్ని పెంపొందించుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని వైయస్సార్ కాంగ్రెస్పార్టీ ఆధ్వర్యంలో ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫుట్బాల్ కోచ్ ప్రసాద్, ఆర్గనైజర్ కాయల సురేష్బాబు, కల్పన, నాయకులు సంతోష్ రమేష్, ఎ.కాణిక్యం, సాగర్, ప్రదీప్, అరుల్, దేవా, సందేశ్, రాజారావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# భయం మొదలైంది!

## • చంద్రబాబు గుండెల్లో అవినీతి రైళ్ళు

**తప్పు చేయనివాడిలో భయం కనిపించదు. తప్పు చేసినవాడి కళ్ళల్లో భయం కనిపిస్తుంది. తప్పు చేసినవాడి మాటల్లోనూ ఆ భయం దొర్లుతుంది. గుండెల్లో ఆ భయం ఏర్పడ్డప్పుడే నా మీద కేసులు పెట్టాలని చూస్తున్నారు, నా మీదకు వాళ్లొచ్చినప్పుడు ప్రజలంతా నాకు రక్షణ కవచంలా ఏర్పడి నన్ను కాపాడుకోవాలనే మాటలు వస్తుంటాయి.**

నవ్యాంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇటీవల కేసుల భయం పట్టుకుంది. ఆమధ్య 'ఓటుకు నోటు' కేసులో ఇరుక్కుని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు భయపడి కృష్ణా నది కరకట్టకు చేరుకున్నాడు. ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌పై మనకు పదేళ్ళ హక్కున్నప్పటికి, అక్కడి ఆస్తులలో వాటా వున్నప్పటికీ అన్నిటినీ వదిలేసి వచ్చాడు.

రాష్ట్రంలో జగన్ మండించిన ప్రత్యేకహోదా ఉద్యమం పుణ్యాన చంద్రబాబుకు బీజేపీతో స్నేహాన్ని వదులుకోక తప్పలేదు. ఎన్డీఏ నుండి బయటకు వచ్చాక బీజేపీపై విమర్శలు బాగానే చేసాడు. అంతేకాదు, కర్నాటక ఎన్నికల్లో బీజేపీని ఓడించాలంటూ తెలుగుప్రజలకు పిలుపునిచ్చాడు. ఇవన్నీ కూడా బీజేపీ అధిష్టానం వద్ద రికార్డై వున్నట్లు తెలుస్తోంది. ఈ నాలుగేళ్లలో చంద్రబాబు పాలనపై అనేక అవినీతి ఆరోపణలున్నాయి. కేంద్రం ఇచ్చిన నిధులను దారిమళ్ళించడంతో పాటు పోలవరం పేరుతో అంచనాలను భారీగా పెంచడం, విదేశీ పర్యటనలు పేరుతో చేసిన దుబారా, రాజధాని పేరుతో చేసిన అక్రమాలు, పుష్కరాల పేరు చెప్పి కోట్ల నిధుల దుర్వినియోగం... వంటి పాయింట్లెన్నో వున్నాయి. అదీగాక చంద్రబాబు మీద 18 కేసులు స్టేలో వున్నాయి. ఓటు-నోటు కేసు సంగతి ఇంకా తేలలేదు. వీటన్నింటికి మించి రాష్ట్రానికి పంపిస్తున్న కొత్త కరెన్సీని డంపింగ్ చేసారనే ఆరోపణలున్నాయి. వీటిలో దేనిమీద దర్యాప్తు చేయించినా చంద్రబాబు ఎక్కడోచోట దొరికిపోతాడు.

నరేంద్రమోడీ, అమిత్‌ల జోడీ అంటే ఇప్పటికే చాలామందికి భయం పట్టుకుంది. తమను ధిక్కరించిన శశికళ చేత ఊచలు లెక్కపెట్టిస్తున్నారు. పశుదాణా కేసులో లాలూ ప్రసాద్‌యాదవ్ చేత చిప్పకూడు తినిపిస్తున్నారు. వాళ్ళు పగబట్టి తనకూ ఆ గతి పట్టిస్తారేమోనని బాబు భయం. అందుకే తనను కాపాడండంటూ ప్రజలను వేడుకుంటున్నాడు.

# రిచ్‌లో పురిటిబిడ్డకు అరుదైన శస్త్ర చికిత్స



విలేకర్లకు వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ టి.రవికుమార్

నెల్లూరు పొగతోటలోని రిచ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో 14రోజుల పసికందుకు గ్రాన్యులార్ సిల్ ట్యూమర్‌ను శస్త్ర చికిత్స ద్వారా తొలగించినట్లు రిచ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఛైర్మెన్ డా॥ టి.రవి కుమార్ తెలిపారు. ఈ నెల 2న తమ రిచ్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 14రోజుల పసికందుకు ఈ ట్యూమర్ రావడంతో పాలు తాగేందుకు, శ్వాస తీసుకునేందుకు తీవ్రమైన ఇబ్బందితో రిచ్ హాస్పిటల్‌కు తీసుకురావడం జరిగిందన్నారు. ఆ బిడ్డకు అన్ని పరీక్షలు నిర్వహించి గ్యాన్యులార్ సిల్ ట్యూమర్‌గా గుర్తించి అత్యంత క్లిష్టమైన ఈ ఆపరేషన్‌ను డా॥ మల్లినేని శ్రీకాంత్, డా॥ గోవింద్, డా॥ నారాయణస్వామి, డా॥ హజరత్, డా॥నజీర్‌ల సహకారంతో భారతదేశంలో ప్రఖ్యాతిగాంచిన పాండిచ్చేరిలోని జిప్‌మర్ ఇన్‌స్టిట్యూట్ పురిటి పిల్లల ప్రత్యేక ఆపరేషన్ విభాగంలో శిక్షణ పొందిన డా॥ పవన్‌కుమార్ నిమ్మల నిర్వహించారని తెలిపారు. ఇలాంటి శస్త్ర చికిత్సలు మహానగరాలలో మాత్రమే చేస్తారని, కార్పొరేట్ వైద్యశాలలకు ధీటుగా రిచ్‌లో అత్యాధునిక పరికరాలు, మాడ్యూలర్ ఆపరేషన్ థియేటర్లు, నియోనెటల్ పోస్ట్ ఆపరేటివ్ కేర్ యూనిట్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో డాక్టర్లు శ్రీకాంత్ మల్లినేని, గోవింద్, నారాయణ స్వామి, హజరత్, నజీర్‌లు పాల్గొన్నారు.

# దెబ్బతినేదెవరు?

(మొదటి పేజీ తరువాయి)

అనుభవం తనకు లేదని కూడా చెప్పాడు. ఈ లెక్కన చూస్తే ఆయన ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను వైకాపాకు పోకుండా డైవర్ట్ చేయడానికి చంద్రబాబు సూచించిన నియోజక వర్గాలలోనే తన పార్టీ అభ్యర్థులను పోటీలోకి దింపుతాడనే ప్రచారం జరిగింది.

ఇటీవలకాలంలో డామిట్ కథ అడ్డం తిరిగింది. మనోడే అనుకున్న పవన్ కళ్యాణే చంద్రబాబు మీద కావాల్సినంత బురద చల్లాడు. జగన్ కంటే పవనే ఇప్పుడు చంద్రబాబుకు అపాయంగా మారాడు. జగన్ తెలిసిన ప్రమాదం. పవన్ ఊహించకుండా వచ్చిన ప్రమాదం. చంద్రబాబు మీద జగన్ అవినీతి ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మొచ్చు, నమ్మకపోవచ్చు. కాని నిన్నటిదాకా చంద్రబాబును మోసిన పవన్‌కళ్యాణ్ అవినీతి ఆరోపణలు చేస్తే మాత్రం జనం నమ్ముతారు. ఇదే చంద్రబాబుకు మింగుడుపడని విషయం.

మొన్నటిదాకా బలమున్న చోటే పోటీ చేస్తానన్న పవన్‌కళ్యాణ్, ఇప్పుడు రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తానంటున్నాడు. 2009 ఎన్నికల్లో తన అన్న చిరంజీవి పోషించిన పాత్రనే ఇప్పుడు పవన్‌కళ్యాణ్ పోషించబోతున్నాడు. చిరంజీవి ప్రజారాజ్యం ఆనాడు ఉమ్మడి ఏపిలోని అన్ని స్థానాల్లో పోటీ చేసి 18సీట్లను గెలుచుకుంది. ఆరోజు ప్రజారాజ్యం పోటీ వల్ల అసెంబ్లీలో కాంగ్రెస్‌కే నష్టం వాటిల్లింది. అప్పుడు వై.యస్. ప్రభుత్వం మీద వ్యతిరేకత లేదు. కాని కాంగ్రెస్ ప్రభుత్వ సానుకూల ఓట్లను ప్రజారాజ్యం కొంతవరకు చీల్చింది. కాబట్టే, రాష్ట్రంలో కాంగ్రెస్ 34లోక్‌సభ సీట్లను గెలిచినా అసెంబ్లీలకొచ్చేసరికి 154స్థానాలకే పరిమితమైంది. లోక్‌సభ స్థానాలతో పోల్చి చూస్తే కనీసం 180 స్థానాలకు తగ్గకూడదు. కాని, కృష్ణా నుండి శ్రీకాకుళం దాకా కాంగ్రెస్ అండగా నిలిచే కాపు సామాజికవర్గం ఓట్లు ఆనాడు చిరంజీవి చీల్చాడు.

మరి రేపు పవన్ ఎవరి ఓట్లను చీల్చబోతున్నాడన్నది పెద్ద ప్రశ్నార్థకంగా మారింది. 2014 ఎన్నికల్లో పవన్ ఓట్లన్నీ తెలుగుదేశంకు పడ్డాయి. చంద్రబాబు అధికారంలోకి రావడానికి ఆ ఓట్లే కారణమయ్యాయి. ఈ ఓట్లే రేపు పవన్‌కు పడతాయి. పవన్ ఎన్నికల్లో పోటీ చేయకపోతే ఆయన ఓట్లు ఈసారి టీడీపీకి పడతాయో లేక వైసిపికి డైవర్ట్ అవుతాయో, అదీగాకుంటే రెండు పార్టీల మధ్య చీలుతాయో చెప్పలేని పరిస్థితి. కాని పవన్ పోటీ చేస్తే మాత్రం 2014 ఎన్నికల్లో టీడీపీకి పడ్డ పవన్ మద్దతుదారుల ఓట్లు ఆయన పార్టీకి డైవర్ట్ అవుతాయి. పవన్ వల్ల వైసిపి ఓటు చీలడం వుండదు. ఏ విధంగా నష్టం జరిగినా అది తెలుగుదేశంకే!

# బాలల సంరక్షణ కోసం జాగ్రత్తలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎఎస్పీ బి.శరత్‌బాబు

బాలల సంరక్షణ, సంక్షేమం కోసం పని చేస్తున్న అన్ని శాఖలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆ దిశగా అందరం కలిసి పనిచేద్దామని నెల్లూరుజిల్లా ఎఎస్పీ బి.శరత్‌బాబు పిలుపునిచ్చారు. గత నెల 30న నెల్లూరు ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్లో బాలల సంరక్షణపై బాలల సంక్షేమ కమిటి, బాలల న్యాయమండలి సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ అనాధ ఆశ్రమాలు నిర్వహించే స్వచ్ఛంధ సంస్థలు చైల్డ్ మిస్సింగ్ వెబ్‌సైట్‌ను ఉపయోగించడం లేదన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటి ఆదేశాలను పాటించడం లేదన్నారు. బాలల సంరక్షణపై ప్రతినెలా నిర్వహించే సమావేశానికి అన్ని వివరాలతో అందరూ తప్పక హాజరుకావాలని సూచించారు.

# కోవూరుకి టిఎస్ఆర్ నిధులు

నెల్లూరుజిల్లా కోవూరు నియోజకవర్గానికి రాజ్యసభసభ్యుడు తిక్కవరపు సుబ్బరామిరెడ్డి రూ.27లక్షల నిధులు మంజూరు చేసినట్లు వైయస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గత నెల 30న ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకూరుపేట మండలం జేజేపేట పంచాయితీలో అబ్బయ్యరెడ్డి ఇంటి నుంచి గంగపట్నం కాలువ వరకు సైడ్ డ్రైయిన్ల నిర్మాణానికి రూ.4లక్షలు, గంగపట్నం పంచాయితి పల్లిపాళెంలో సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి రూ.4లక్షలు కేటాయించారన్నారు. వవ్వేరు నుంచి చెన్నూరురోడ్డు పొలాలకు వెళ్ళేందుకు గ్రావెల్‌రోడ్డు ఏర్పాటుకు రూ.3లక్షలు, విడవలూరు మండలం అలగానిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీగోడకు రూ.3లక్షలు మంజూరు చేసారన్నారు. పోతిరెడ్డిపాలెం పంచాయతి తిప్పగిరిజన కాలనీలో సిసి రోడ్డుకు రూ.5లక్షలు, సెయింట్ పాల్స్ పాఠశాల ఎదురుగా ఉన్న పాతస్మశానం అభివృద్ధికి రూ.3లక్షలు, కొత్తూరు స్మశాన ప్రహరీకి రూ.2లక్షలు, విడవలూరులోని మన్మధరావుపేట గిరిజన కాలనీలో ప్రహరీకి రూ.3లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.

# ఏసిబి వలలో రవాణా అటెండర్

నెల్లూరు రవాణాశాఖ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న కరాడు నరసింహారెడ్డి ఇంటిపై ఈ నెల 1వ తేదీ ఏసిబి అధికారులు దాడులు చేసారు. విజయవాడ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ డిఎస్పీ రమాదేవి ఆధ్వర్యంలో నెల్లూరు ఎం.వి.అగ్రహారంలోని నరసింహారెడ్డి ఇంటిపై అలాగే ఆర్టీఏ ఏజెంట్ బి.ప్రసాద్, నరసింహారెడ్డి సోదరులు, వియ్యంకుడు, బావమరిది ఇళ్ళపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సోదాలలో ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు గుర్తించారు. ఈ తనిఖీలలో నరసింహారెడ్డి, అతని కుటుంబసభ్యుల పేర్ల మీద వున్న స్థలాలు, పొలాల డాక్యుమెంట్లు, 2కేజీల బంగారం, ఇంట్లో 7.70 లక్షల నగదు, బ్యాంకులో 20లక్షల నగదు, పలు డిపాజిట్ పత్రాలు వెలుగులోకి వచ్చాయి. వీటికి ప్రభుత్వ రేటు ఎంత, మార్కెట్ రేటు ఎంత అనేదానిపై మదింపు జరుగుతోంది. నరసింహారెడ్డి 34ఏళ్ళుగా రవాణా శాఖలో అటెండర్‌గానే పనిచేస్తున్నాడు. ప్రమోషన్లు వచ్చినా తీసుకోకుండా అటెండర్ పోస్టులోనే కొనసాగుతున్నాడు. జిల్లా నుండి ఏసిబి డిజిపి ఠాకూర్‌కు నరసింహారెడ్డిపై పలువురు ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ దాడులు జరిగినట్లుగా సమాచారం.

# జగన్ వాగ్దానం... బాబుకు అవమానం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర రాజకీయాలలో పెనుఉప్పెనలా వచ్చిన ఎన్టీఆర్‌ను రాజకీయ ప్రత్యర్థులు ఎవరూ ఏమీ చేయలేకపోయారు. 1984లో కాంగ్రెస్ మద్దతుతో నాదెండ్ల భాస్కర్‌రావు వెన్నుపోటు పొడిచినా వెంటనే తేరుకుని, కోలుకుని నిలబడ్డాడు. కాని, 1995 ఆగస్టులో సొంత అల్లుడు చంద్రబాబు, కుటుంబసభ్యులు కలిసికొట్టిన దెబ్బకు ఎన్టీఆర్ కోలుకోలేకపోయాడు. లేవలేకపోయాడు. కొన్ని నెలలు తిరక్కముందే స్వర్గస్తుడయ్యాడు. 1995లో ఎన్టీఆర్‌ను నిర్ధాక్షిణ్యంగా తెలుగుదేశం పార్టీ నుండి గెంటేసారు. ఆయన స్థాపించిన పార్టీలో ఆయనకు చోటులేకుండా చేసారు. పార్టీ సభ్యత్వ పుస్తకం మీదే కాదు, చాలా కాలం పార్టీ కరపత్రాలలో, పార్టీ బ్యానర్లలో ఆయన పేరు, ఆయన బొమ్మ లేకుండా చేసారు.

అయితే ఎన్టీఆర్ మరణం తర్వాత క్రమం తప్పకుండా ప్రతి ఎన్నికలలోనూ తెలుగుదేశం వాళ్ళు ఎన్టీఆర్ బొమ్మను వాడుకుంటున్నారు. ఆయన బ్రతికున్నప్పుడు ఆయనను వాడుకున్నారు. ఆయన మరణించాక ఆయన బొమ్మను వాడుకుంటున్నారేగాని ఆయన స్మృతిగా ప్రజల మనసుల్లో గుర్తుండిపోయేలా ఒక్క పనీ చేయలేకపోయారు. 1995 నుండి 2004 దాకా చంద్రబాబే ఏపికి సీఎం, మళ్ళీ గత నాలుగేళ్ళుగా ఆయనే సీఎం. ఎన్టీఆర్ పుట్టి పెరిగిన కృష్ణాజిల్లాకు ఆయన పేరును పెట్టాలన్న ఆలోచన చంద్రబాబుకు రాలేదు. అదే కాంగ్రెస్‌లో వాళ్ళు దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి మరణించాక ఆయన పేరును కడప జిల్లాకు పెట్టారు. కాంగ్రెస్ నాయకులకు వున్న విజ్ఞత, చిత్తశుద్ధి చంద్రబాబుకు లేకుండా పోయింది.

ఇప్పటివరకు చంద్రబాబు చేయలేని పనిని తాను చేస్తానంటూ ప్రతిపక్ష నేత వై.యస్.జగన్ వదిలిన అస్త్రంతో తెలుగుదేశం నాయకులు షాకయ్యారు. కృష్ణా జిల్లాలో ప్రజాసంకల్ప పాదయాత్ర చేస్తున్న జగన్ ఎన్టీఆర్ స్వగ్రామం నిమ్మకూరులో పర్యటించినప్పుడు వైసిపి అధికారంలోకి రాగానే కృష్ణాజిల్లాకు ఎన్టీఆర్ పేరు పెడతామని ప్రకటించాడు. జగన్ నోట ఈ మాట రావడంతో తెలుగుదేశం శ్రేణులు ఉలిక్కిపడ్డాయి. జగన్ నుండి ఇంతటి సానుకూల ప్రకటన వస్తుందని ఎవరూ వూహించరు. జగన్ ప్రకటన ఎన్టీఆర్ అభిమానుల్లో ఆనందాన్ని కలిగించింది.

జగన్ ప్రకటన తర్వాత చంద్రబాబు ఇప్పుడు నాలుక్కరుచుకుని తన హయాంలోనే కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టే చర్యలకు ఉపక్రమించవచ్చు. చంద్రబాబు ఇప్పుడు హడావిడిగా కృష్ణాజిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టినా క్రెడిట్ మాత్రం జగన్‌కే వెళుతుంది.

# అమ్మకు అంజలి



## శ్రీమతి పందిళ్ళపల్లి అరుణమ్మ

02.05.1951 - 10.05.2016

అమ్మను మించిన దైవం లేదు...
అమ్మ ప్రేమను మించిన అమృతం లేదు...
అమ్మను మరపించే బంధం లేదు!

ద్వితీయ వర్ధంతి సందర్భంగా...

అమ్మ జ్ఞాపకాలతో...

కుటుంబసభ్యులు

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com